జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 04, సెప్టెంబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



## శివారు ప్రాంతాలకు సైతం ఆహార పదార్థాలు

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

విజయవాడ, మహానాడు:

క్షేత్రస్థాయిలో వరద బాధితులందరికీ సహాయ సహకారాలు అందించేందుకు అహర్నిశలు కృషిచేస్తున్నామని, నగర చివర ప్రాంతాలకు సైతం ఆహార పదార్థాలు అందించే విధంగా 32 మంది ఐఏఎస్ అధికారులను నియమించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇంకా... ఆయన ఏమన్నారంటే

మూడు రోజులుగా ఇబ్బందుల్లో ఉన్న ప్రజలను సర్వశక్తులు ఒడ్డి వారికి మిగతా.. 5లో



# 'అమరావతి'పై అన్నీ అబద్ధాలే!

- అమరావతి మునిగిపోతుందంటూ అబద్ధాల ప్రచారం
- ఓడినా వీడని వైసీపీ దుష్ప్రచారం
- వైసీపీ సోషల్‌మీడియాలో అబద్ధాల 'వరద'
- బెజవాడ సాయంలోనూ అంతే
- వైసీపీ కార్యకర్తలకు టీడీపీ ముసుగు
- వాటితో వార్తల వైరల్
- చేష్టలుడిగిన కూటమి సర్కారు
- సర్కారు మౌనంపై కూటమి నేతల కన్నెర్ర
- చర్యల కొరడా ఝుళిపించడంలో చేష్టలుడిగిందంటూ అసంతృప్తి
- జగన్ జమానాలో సోషల్‌మీడియాపై ఉక్కుపాదాన్ని గుర్తు చేస్తున్న తమ్ముళ్లు

(మార్తి సుబ్రహ్మణ్యం)

ఓ వైపు బెజవాడను ముంచెత్తిన భారీ వర్షంలో చిక్కుకున్న వారికి సాయం చేయడంపై సర్కారు దృష్టి సారిస్తుంటే.. మరోవైపు భారీ వర్షాలకు అమరావతి మునిగిపోయిందంటూ వైసీపీ సోషల్‌మీడియా అనుకూల మీడియా చేస్తున్న దుష్ప్రచారం గందరగోళానికి కారణమవుతోంది. ఇంత జరుగుతున్నా విషప్రచారం చేస్తున్న వారిపై జగన్ జమానా తరహాలో పోలీసులు, చర్యల కొరడా ఝుళిపించడంలో తమ ప్రభుత్వం భయపడుతోందన్న విమర్శలు కూటమి కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి.

సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులూ అహెూరాత్రులు పనిచేస్తూ బాధితులకు సాయం అందిస్తుంటే, రాజధాని నగరమైన అమరావతి మునిగిపోతోందంటూ జరుగుతున్న దుష్ప్రచారంపై.. సర్కారు మౌనంగా ఉంటున్న తీరు కూటమి కార్యకర్తలు అసంతృప్తికి కారణమవుతోంది. సోషల్‌మీడియా వేదికగా జరుగుతున్న ఈ విషప్రచారాన్ని అరికట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో బాబు సర్కారు పూర్తి స్థాయిలో విఫలమైందన్న మిగతా.. 2లో

# జేసీబీపైనే 22 కి.మీ ప్రయాణించిన చంద్రబాబు



- నాలుగున్నర గంటల పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు విస్తృత పర్యటన
- వాహనాలు వెళ్లలేని ప్రాంతాలకు జేసీబీలో బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి కష్టాలు తెలుసుకున్న సిఎం
- భవానీపురం నుండి సితార సెంటర్, కబేళా సెంటర్, జక్కంపూడి, వాంబే కాలనీ, అంబాపురం, కండ్రిక, నున్నా ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతాల్లో పర్యటన
- వరద బాధిత ప్రాంతాల్లో అందుతున్న సాయాన్ని పర్యవేక్షించి, ప్రజలకు ధైర్యం చెప్పిన ముఖ్యమంత్రి

అమరావతి,మహానాడు:


ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడవ రోజూ వరద ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. మధ్యాహ్నం 1 గంట నుంచి దాదాపు నాలుగున్నర గంటలు వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. కార్లు వెళ్లే అవకాశం లేని చోట కాన్వాయ్ ను పక్కన పెట్టి దాదాపు 22 కిలోమీటర్లు జేసీబీపైనే చంద్రబాబు పర్యటించారు.

ఆయా ప్రాంతాల్లో ఇప్పటికీ ముంపులో ఉన్న బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లారు. వదర బాధితులకు అందుతున్న సాయాన్ని స్వయంగా అడిగితెలుసుకున్నారు. వారి ఆవేదన, బాధను విని ధైర్యం చెప్పారు. ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రజలకు భరోసా ఇచ్చారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో రెండు రోజులుగా బసచేస్తున్న సిఎం...మూడవ రోజు మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి భవానీపురం వెళ్లారు.

ముందుగా అక్కడ బాధితులతో మాట్లాడారు. తమకు సాయం చేరిందని...ఇప్పుడు కాస్త వరద తగ్గడంతో సాంత్వన చేకూరిందని ఆ ప్రాంత ప్రజలు చెప్పారు. సితార సెంటర్ నుంచి కార్లు వెళ్లలేని పరిస్థితుల్లో కాన్వాయ్ పక్కన పెట్టి జెసిబి ఎక్కి ముందుకు కదిలారు. దారి పొడవునా బాధితులతో మాట్లాడారు. అదే జేసీబీపై జక్కంపూడి వెళ్లి అక్కడ బాధితులను కలిసి ప్రజలకు అందుతున్న వరద సాయంపై తెలుసుకున్నారు.

అక్కడి నుండి వాంబే కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, నున్న, కండ్రిక ఇన్నర్ రింగ్ రోడ్ కు వచ్చారు. అక్కడికి తన కాన్వాయ్ రావడంతో అక్కడి నుంచి కారు ఎక్కి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ విధంగా దాదాపు నాలుగున్నర గంటల పాటు సిఎం అన్ని ప్రాంతాల్లో జేసీబీపైనే ప్రయాణం చేశారు. పలు ప్రాంతాల్లో బాధితుల సమస్యలు విన్న సిఎం అధికారులను పిలిచి వార్నింగ్ ఇచ్చారు. సమన్వయం లోపం కారణంగా వేగంగా సాయం అందకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

అధికారుల్లో బాధ్యత, భయం తీసుకురావాలనే కారణంతోనే తాను స్వయంగా మిగతా.. 2లో





## వైఎస్ వల్లే బెజవాడ మునిగిందా?

(ఏ.బాబు)

విజయవాడ మునిగిపోయింది అని ఎగతాళి చెసె వాళు ఓపిగ్గా మొత్తం చదువుకోండి. ఎక్కడో ఖమ్మం కృష్ణా జిల్లాల సరిహద్దులలో కొండప్రాంతలలో మిగతా.. 2లో

## ప్రజల ప్రాణ రక్షణే మా ప్రభుత్వం లక్ష్యం

- బుడమేరు నిర్వహణపై గత ప్రభుత్వం శ్రద్ధ పెట్టలేదు... వారి నిర్లక్ష్యం వల్లే విజయవాడకు ఇంతటి ముప్పు
- వరద సహాయ కార్యక్రమాలకు ఆటంకం ఉండకూడదనే వెళ్లలేదు
- గత 50 ఏళ్లలో ఎప్పుడూ రానంత వరద వచ్చింది
- ప్రతి నగరానికీ పకడ్బందీ ఫ్లడ్ మేనేజ్మెంట్ ప్లాన్ ఉండేలా చర్యలు తీసుకుంటాం
- ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.కోటి విరాళం
- విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



విజయవాడ, మహానాడు:

విపత్తు సమయంలో నిందలు వేయడం కంటే ప్రజల ప్రాణాలు కాపాడడం తమ ప్రభుత్వం ముందున్న లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మిగతా.. 2లో

## కేసీఆర్.. ఎక్కడ?


- వరదసాయంలో కనిపించని వైనం
- తెలంగాణలో ఫాంహౌస్‌కే కేసీఆర్ పరిమితం
- హైదరాబాద్, ఖమ్మంలో మినహా కనిపించని గులాబీదళం
- అమెరికా నుంచి సర్కారు సాయంపై కేటీఆర్ విమర్శల ట్వీట్లు
- హాస్టళ్లలో హరీష్‌రావు పర్యటనలు
- వానలోనూ బాబు-రేవంత్ పర్యటనలు, పరామర్శలూ
- విపత్తులోనూ బయటకు రాని కేసీఆర్‌పై విమర్శలు
- ఆపన్నులకు సాయం బీఆర్ఎస్ సాయం చేయదా?
- సోషల్‌మీడియాలో తడిసిముద్దవుతున్న కేసీఆర్

10లో



బెజవాడపై బ్రహ్మంగారి మాట నిజమవుతోందా?

3లో



కృష్ణలంక రిటైనింగ్ వాల్ కట్టిందెవరు?

3లో



ముంపు ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు

4లో



లక్షకోట్లు తిన్న జగన్ జనం కోసం వందకోట్లివ్వలేరా?

5లో

# రాష్ట్రవ్యాప్తంగా చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తాం

- ఆక్రమణల తొలగింపునకు పక్కా ప్రణాళిక
- ప్రకృతి విపత్తులపై బ్లూ బుక్ తయారు చేసుకోవాలి
- మున్నేరు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపుపై సమీక్షిస్తాం
- మూడు తండాలను కలిపి ఒకే ఆదర్శ కాలనీగా నిర్మించాలి
- పువ్వాడ ఆక్రమణల తొలగింపునకు హరీష్ సహకరిస్తారా?
- మహబూబాబాద్ జిల్లా సమీక్షల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- యువ శాస్త్రవేత్త అశ్వినీ కుటుంబ సభ్యులకు ఓదార్పు
- వరద సహాయక చర్యలకు ప్రభుత్వ ఉద్యోగుల రూ.135 కోట్ల విరాళం

ఖమ్మం, మహబూబాబాద్,

ప్రకృతిని చెర బడితే అది ప్రకోపిస్తుందని.. ప్రకృతి ప్రకోపంతోనే ఉత్తరాఖండ్‌లోనైనా, మన దగ్గరైనా విపత్తులు సంభవిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భారీ వర్షాల సమయంలో వరదలు సంభవించి కాలనీలకే కాలనీలే మునిగిపోవడానికి కారణం చెరువులు, నాలాల ఆక్రమణే కారణమన్నారు.

హైడ్రాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే డిమాండ్ వస్తోందని, మిగతా.. 10లో





## జిల్లాకో 'హైడ్రా'

- చెరువులు, నాలాల ఆక్రమణల జాబితా సిద్ధం చేయాలి
- మానవత్వం లేని మనిషి కేసీఆర్
- మాజీ మంత్రి ఆక్రమణలపైన తొలగింపునకు హరీష్ రావు సహకరిస్తారా?
- వరదలు వచ్చినప్పుడు కేసీఆర్ పదేళ్లలో ఎప్పుడైనా పరామర్శకు వచ్చారా?
- మహబూబాబాద్ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

2లో..

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 04, సెప్టెంబర్ 2024



# వైఎస్ వల్లే బెజవాడ మునిగిందా?

(మొదటిపేజీ తరువాయి..)

పుట్టిన బుడమేరు.. A. కొండూరు, మైలవరం, జి.కొండూరు మండలాల గుండా విజయవాడ సింగ్ నగర్ ప్రాంతంలోకి ప్రవహిస్తుంది. బుడమేరుకి రెడ్డిగూడెం నుండి కోతుల వాగు, జి.కొండూరు మండల గంగినేని నుండి పులివాగు మునగపాడు నుండి బీమ్ వాగు, CH మాధవరం నుండి లోయవాగు, గడ్డమణుగు లోయప్రాంతం నుండి దొర్లింతల వాగు ఉపవాగులుగా ఉన్నాయి.

సరిగ్గా 20ఏళ్ల తర్వాత విజయవాడ నగరం ముంపున కు గురైంది. వాగులు, వంకలు ఆక్రమణకు గురైతే ప్రకృతి కన్నెర చేస్తుందని మరోసారి రుజువైంది. 20ఏళ్ల క్రితం చేపట్టిన ఆపరేషన్ కొల్లేరు అర్థాంతరంగా నిలిచిపోవడంతో దానికి మూల్యం నేడు చెల్లించుకుంటున్నారు.

20 ఏళ్లలో విజయవాడ నగరం ఊహించని వేగంగా విస్తరించడం, బుడమేరు ప్రవాహ మార్గాన్ని కబ్జా చేయడమే ప్రస్తుత పరిస్థితికి కారణమైంది. ముఖ్యంగా 2019 నుండి జగన్ పాలనలో వైకాపా నాయకుల కబ్జాకి బలైంది బుడమేరు.. అసలు బుడమేరుతో విజయవాడ మునకకు ముఖ్య కారణం వైఎస్ రాజశేఖర్ రెడ్డి.

విజయవాడ నగరానికి పక్కగా ప్రవహించే కృష్ణానదికంటే నగరం మధ్యలో ప్రవహించే బుడమేరుతో దశాబ్దాలుగా దానికి ముప్పు పొంచి ఉంది. 2005లో చివరి సారి బుడమేరు బెజవాడ పుట్టిముంచింది. 2005సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వర్షాలతోనగరం అతలాకుతలమైంది. విజయవాడ మూడొం తులు ముంపుకు గురైంది. వరదల కారణంగా విజయవాడలో కార్పొరేషన్ ఎన్నికలు సైతం వాయిదా పడ్డాయి. దీనికి ప్రధాన కారణం బుడమేరు ఉగ్రరూపంతో ప్రవహించడమే. రికార్డు స్థాయిలో ఎగువున ఖమ్మం జిల్లా నుంచి వరద ప్రవాహం పోటెత్తడంతో అదంతా విజయవాడను ముంచెత్తింది.

ఖమ్మం జిల్లాలో పుట్టే బుడమేరు ఏటా సాధారణ సీజన్‌లో గరిష్ఠంగా 11వేల క్యూసెక్కుల ప్రవాహంతో ప్రవహిస్తుంది. 2005లో అది 70వేల క్యూసెక్కులకు చేరింది. బుడమేరు ప్రవాహాన్నినియంత్రించడానికి వెలగలేరు వద్ద ఓ రెగ్యులేటర్‌ను కూడా 70వ దశకంలో నిర్మించారు. వెలగలేరు మీదుగా ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, విజయవాడ రూరల్ మీదుగా నగరంలోకి ఇది ప్రవేశిస్తోంది.

2005లో వచ్చిన వరదలకు కారణాలను వివరిస్తూ దేవినేని ఉమామహేశ్వరరావు, సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకుడు కొల్లి నాగేశ్వరరావు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. బుడమేరు ముంపుకు శాశ్వత పరిష్కారం చూపకపోతే కృష్ణా జిల్లాకు ఎప్పటికీ ముంపు పొంచి ఉంటుందని ఆందోళనకు దిగడంతో, ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి స్వయంగా విజయవాడ వచ్చారు.

విజయవాడలో ఉన్న వరద పరిస్థితి మొత్తాన్ని ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. బుడమేరు ప్రవాహాన్ని కట్టడి చేయాలంటే దానిని మళ్లించడం ఒక్కటే మార్గమని భావించారు.

పోలవరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి జలాలను కుడి కాల్వ ద్వారా కృష్ణా నదిలో కలిపే డిజైన్ అప్పటికే ఖరారైంది. బుడమేరు ప్రవాహానికి దిగువన పోలవరం కుడికాల్వ కృష్ణానదిలో గుర్తించి అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని అధికారులకు నాటి సీఎం వైఎస్సార్ సూచించారు.

విజయవాడ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు బుడమేరు మలుపులు సరి చేసి, నీటి ప్రవాహం నేరుగా కొల్లేరుకు చేరేలా చూస్తామని, వరదల్లో నీటి ప్రవాహం వెనక్కి ఎగదన్నకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలవరం కుడి కాల్వ నిర్మాణంలో భాగంగా 2007-08 నాటికి బుడమేరు దిగువ ప్రవాహాన్ని కుడి కాల్వలోకి మళ్లించారు. కొత్తగా మరో కాల్వను తవ్వకుండా విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వచ్చే జలాలను కృష్ణా నదిలో కలిపే కాల్వలోకి మళ్ళించారు.ఇక్కడే సాంకేతికంగా ఓ సమస్య తలెత్తింది. పోలవరం కుడి కాల్వను గరిష్ఠంగా 37,500 క్యూసెక్కుల ప్రవాహం ఉండేలా డిజైన్ చేశారు.

విటిపిఎస్ మీదుగా ప్రవహించే కాల్వలకు అంత సామర్థ్యం లేదు. వాటిని వరద ప్రవాహానికి అనుగుణంగా పెంచాలని ప్రతిపాదనలు ఉన్నా, థర్మల్ పవర్ ప్రాజెక్ట్ లోపల కాల్వలను విస్తరించే పరిస్థితి లేకపోవడంతో బుడమేరు వరద ప్రవాహానికి అనుగుణంగా కాల్వల సామర్థ్యం పెరగలేదనే వాదన ఉంది. దీనికి తోడు కృష్ణానది ముఖ ద్వారంలో ఉన్న నిర్మాణాలు కూడా వరద ప్రవాహాన్ని నిరోధిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.

విటిపిఎస్ నుంచి కృష్ణా నదిలోకి బుడమేరు వరద నీరు చేరాలంటే కృష్ణానదిలో నీటి మట్టం తగిన స్థాయిలోఉండాలి. కృష్ణా నదిలో ఎగువ నుంచి వరద కొనసాగే సమయంలో బుడమేరు నుంచి వచ్చే వరద ప్రవాహం నదిలోకి చేరదు. అదే సమయంలో పోలవరం కుడి కాల్వ నుంచి నీటి విడుదల కొనసాగితే వరద ప్రవాహం దిగువన విజయవాడ వైపే వెళ్లాల్సి ఉంటుంది.

### 20ఏళ్ల నిర్లక్ష్యానికి మూల్యం..

20ఏళ్ల క్రితం వచ్చిన వరదల్లో విజయవాడ నగరంలో న్యూ రాజరాజేశ్వరి పేట, సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. రోజుల తరబడి ప్రజలు వర్షపు నీటిలో చిక్కుకుపోయారు. బుడమేరుకు వెలగలేరు రెగ్యులేటర్ దిగువన మళ్లింపు చేపట్టగానే విజయవాడకు వరద ముంపు తప్పిపోయింది.

2008 నుంచి విజయవాడ రూరల్ మండలంలో వేగంగా నిర్మాణాలు విస్తరించాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏకంగా నగరంలో మరో కొత్త ప్రాంతాలు ఏర్పడ్డాయి. విజయవాడ సెంట్రల్ నియోజక వర్గం పరిధిలో న్యూ రాజరాజేశ్వరిపేట ఎక్స్‌టెన్షన్, నందమూరి నగర్ వంటి ప్రాంతాలు విస్తరిం చాయి. అంతకు ముందు అదంతా బుడమేరు పరివాహక ప్రాంతమనే సంగతిని పూర్తిగా విస్మరించారు.

2005లో చేపట్టిన బుడమేరు డైవర్షన్ పనులు పూర్తిగా అటకెక్కిన సంగతి కూడా ప్రజా ప్రతినిధులు విస్మరించారు. బుడమేరు ప్రవాహం విజయవాడ నగరంలోకి రాకుండా ఏర్పాటు చేసిన కరకట్టను 2008 నుంచి పూర్తిగా ధ్వంసం చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ కరకట్ట ఇప్పుడు ఆనవాళ్లు కూడా లేకుండా పోయింది.

సుందరీకరణ పేరుతో నగరానికి రక్షణగా ఏర్పాటు చేసిన వ్యవస్థల్ని రాజకీయ నాయకులు యథేచ్ఛగా ధ్వంసం చేశారు. కాలనీలకు కాలనీలను విస్తరించి నివాస ప్రాంతాలను విస్తరించడంలో 2009 నుంచి విజయవాడలో ఎన్నికైన ఎమ్మెల్యేలు కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్, వైసీపీలకు ఇందులో ఎక్కువ భాగస్వామ్యం ఉంది.

బుడమేరు ఉగ్రరూపం దాల్చినపుడు నీటి ప్రవాహానికి అనుగుణంగా పలు చోట్ల మలుపులు ఏర్పడ్డాయి. రెండు, మూడు దశాబ్దాల క్రితం & నాలుగైదేళ్ల క్రితం బుడమేరుకు వరదలు వచ్చినా.. పంట పొలాలు మాత్రమే నీట మునిగేవి. బుడమేరు ప్రవాహంలో ఉన్న మలుపులు నీటి సహజ ప్రవాహ వేగాన్ని తగ్గించి ఊళ్లను ముంచెత్తుతున్నాయని, విజయవాడ, నిడమానూరు ప్రాంతాల్లో ఉన్న "యూ" టర్నింగ్‌లను సవరించాలని 20ఏళ్ల క్రితమే ఇరిగేషన్ శాఖ ప్రతిపాదించింది.

బుడమేరును ఆక్రమణల నుంచి విడిపించి దాని గరిష్ట సామర్థ్యానికి అనుగుణంగా విస్తరించాలని ప్రతిపాదించారు. విజయవాడ మార్కు రాజకీయం ఆ పనుల్ని అడ్డుకుంది. ఇళ్లను తొలగిస్తే ఊరుకోమని హెచ్చరించడంతో ప్రభుత్వం కూడా వదిలేసింది. ఇదే అదనుగా బుడమేరును యథేచ్ఛగా ఆక్రమించేశారు. ఇక విటిపిఎస్ నుంచి ప్రవహించే వరద ప్రవాహ మార్గంలో ఉన్న నిర్మాణాలు కూడా విజయవాడ ముంపుకు కారణమవుతున్నాయి. వాటిని సరిచేసే సంకల్పం ఏ పార్టీకి లేకపోవడమే ప్రస్తుత పరిస్థితి కారణమైంది.

ప్రపంచంలోనే అతిపెద్ద మంచి నీటి సరస్సుకు నీటిని అందించే నీటి వనరుల్లో బుడమేరు ఒకటి, పశ్చిమగోదావరిలో తమ్మిలేరు, ఎర్రకాల్వలతో పాటు కృష్ణాలో బుడమేరు కొల్లేరుకు ప్రధాన నీటి వనరుగా ఉంటుంది. కొల్లేరులో వరద ప్రవాహాన్ని స్వీకరించకుండా ఆక్రమణలతో నిండిపోవడంతో వరదలు దిగువకు చేరడంలో జాప్యం జరుగుతోంది. ఖమ్మం, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో ప్రవహించే వర్షపు నీరంతా బుడమేరు ద్వారా 170కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించి కొల్లేరును చేరుతుంది. విచిత్రం ఏమంటే పగలు కూడ పరదాలతో తిరిగినోడి భజన బృందం.. Z+ కేటగిరి 70 సంవత్సరాల నవయువకుడు ప్రజలలో తిరుగుతుంటే వెటకారం చేయడం చాలా బాధాకరం.

# అమరావతిపై అన్నీ అబద్ధాలే!

(మొదటిపేజీ తరువాయి..)

అభిప్రాయం టీడీపీ వర్గాల్లో బలంగా కనిపిస్తోంది.

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జరుగుతున్న వరస సంఘటనలు పరిశీలిస్తే.. బాబు సర్కారు మెతకవైఖరే వైసీపీ విజృంభణకు అసలు కారణమని పార్టీ వర్గాలు తేల్చేస్తున్నారు. దీన్ని బట్టి ఇకపై భవిష్యత్తులో కూడా వైసీపీ దూకుడు, ఆ పార్టీ సోషల్‌మీడియా-అనుకూల మీడియాను, సర్కారు ఏమీ చేయ లేదన్న ముందస్తు నిశ్చితాభిప్రాయానికి వచ్చినట్లు కనిపిస్తోంది.

ఇటీవలి కాలంలో పాఠశాలలు, హాస్టళ్లు, ఇంజనీరింగ్ కాలేజీల్లో జరుగుతున్నవరస ఘటనలపై, వైసీపీ సోషల్ మీడియా జూలు విదిలించిన నేపథ్యంలో.. ప్రభుత్వం హెచ్చ రికలు జారీ చేసినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని ఉదహరిస్తున్నారు. దీన్నిబట్టి ప్రభుత్వం-పార్టీలో ఒకరమైన నిస్తేజం-సమన్వయలోపం ఉందన్న విషయం స్పష్టంగా కనిపిస్తోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఇపపుడు బెజవాడలో భారీ వర్షాల నేపథ్యంలో.. అమరావతి మునిగిపోతోందంటూ జరుగుతున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టడంతో పాటు, ఎదురుదాడి చేయడంలో వ్యవస్థగా ప్రభుత్వం-పార్టీగా టీడీపీ విఫలమయిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

నిజానికి సెక్రటేరియేట్‌కు వెళ్లే రహదారులన్నీ సాధారణం గానే కనిపించాయి. ఆ మార్గంలో ఎక్కడా నీరు నిలిచిన దాఖలాలు లేవు. ఐఏఎస్, ఎమ్మెల్యే క్వార్టర్స్ భవనాల మార్గం కూడా ఎక్కడా నీరు నిలిచిన దాఖలాలు లేవు. మందడం వరకూ సీడ్ యాక్సిస్ రోడ్డు ఎప్పటిమాదిరిగానే ఉంది. కాకపోతే ఆ మార్గాల్లో చిన్న గుంతలేమైనా ఉంటే అక్కడ నీళ్లు నిలిచాయే తప్ప, రాకపోకలకు ఆటంకం కలిగించే స్థాయిలో ఆ రహదారులు కనిపించవు. అయినప్పటికీ అమరావతి మునిగిపోతుందంటూ మొదలైన విష ప్రచారం ప్రజలను ఆందోళనకు గురిచేసింది.

అసలు విజయవాడలో బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, వాటికి సమీపంలోని కాలనీల్లో ఎక్కడా వర్షం ప్రభావం కనిపించలేదు. బస్టాండు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే మార్గాలే ముంపునకు గురయ్యాయి. వాగులకు సమీపంలో ఇళ్లు నిర్మించుకున్న వారు, లోతట్టు ప్రాంతంలో ఇళ్లు, అపార్టుమెంట్లు నిర్మించిన ప్రాంతాలే మునకకు గురయ్యాయి. అయినా ప్రభుత్వం యుద్ధప్రాతిపదిక స్పందించి, డ్రోన్లు-హెలికాప్టర్లు, ట్రాక్టర్ల ద్వారా ఆహారం పంపిణీ చేసింది. ఈ మూడురోజులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన ఇంటికి సైతం వెళ్లకుండా, సీఎం చంద్రబాబు వెంట ఉండి జిల్లా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించి, బాధితులకు సాయం అందించడంలో సఫలీకృతులయ్యారు.

నిజానికి వరదనీరు మొత్తం కొండవీటివాగు ఎత్తిపోతల ద్వారా కృష్ణాన దిలోకి ఎప్పటికప్పుడు వెళ్లిపోతుంటుందనేది బెజవాడ వాసులకు తెలిసిన విషయమే.

అయితే బెజవాడలో కురిసిన భారీ వర్షాలను బూచిగా చూపిస్తూ.. ఏకంగా అమరావతి మునిగిపోతోందంటూ వైసీపీ సోషల్‌మీడియా చేస్తున్న హడావిడికి, గుంటూరు-కృష్ణా జిల్లా వాసులు హడలిపోతున్నారు. ఆ వాదనకు మద్దతుగా కొన్ని పాత వీడియోలు, బాధితుల వాయిస్‌ను చూపెట్టడం ద్వారా, అమరావతి మునిగిపోతోందన్న భావనను నిజం చేసేలా మారాయి. దీనిపై రెండో రోజు మీడియాతో మాట్లాడిన చంద్రబాబు ఖండించి హెచ్చరించినప్పటికీ.. ఆ ప్రచారానికి పూర్తి స్థాయిలో తెరదించే ప్రయత్నాలేమీ పోలీసు చర్యల రూపంలో జరగడం లేదని, టీడీపీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

బెజవాడలో ముంపు ప్రాంతాలు మునిగిన గ్రామాల్లో కొంతమంది వైసీపీ కార్యకర్తలే.. "సహాయ చర్యలు తీసుకోవడంలో మా ప్రభుత్వం పూర్తిగా విఫలమయింది. మేం నిఖార్సయిన టీడీపీ యువగళం కార్యకర్తం. అయినా సరే ఉన్న నిజాలు చెబుతున్నాం. ఇప్పటిదాకా ఎవరూ రాలేదు" అని వైసీపీ అధికార చానెల్‌లో చెప్పడం సంచలనం సృష్టించింది. నిజానికి ఇలాంటి వైసీపీ కార్యకర్తలు చాలామంది టీడీపీ ముసుగులో మీడియాముందుకొచ్చి, ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టడంతో.. జనం కూడా అది నిజమేకామోసనే అభిప్రాయం ఏర్పడేందుకు కారణమయింది.

అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడంతోపాటు, అమరావతికి పెట్టుబడులు రాకుండా చేసే ఈ విష ప్రచారంపై.. గత వైసీపీ సర్కారు స్థాయిలో తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంలో, ఘోరంగా విఫమలయిందంటున్నారు. ఇది ఒకరకంగా తమ ప్రభుత్వ పిరికితనాన్ని ప్రత్యర్థులకు సానుకూల సంకేతాలు పంపించడమేనని స్పష్టం చేస్తున్నారు.

జగన్ జమానాలో ఒక పోస్టును ఫార్వార్డ్ చేసి, కామెంటు పెట్టినందుకే అంకబాబు అనే ఓ సీనియర్ వృద్ధ జర్నలిస్టు, గుంటూరులో శంకర్‌విలాస్ యజమాని అయిన వృద్ధురాలిపై కేసులు పెట్టి జైలుకు పంపిన ట్వవె నాన్ని టీడీపీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. తమ ప్రభుత్వం ఆ స్థాయిలో సగం ధైర్యం కూడా చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

# జిల్లాకో 'హైడ్రా'

మహబూబాబాద్, మహానాడు:

28 సెంటిమీటర్ల వర్షం కురిసినప్పటికీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. అయినా ప్రాణ నష్టం జరగడం బాధాకరం. జిల్లాలో 4గురు చనిపోయారు.. అందులో ఇద్దరు ఈ జిల్లా వాసులు, మరో ఇద్దరు ఖమ్మం జిల్లా వాసులు. మహబూబాబాద్ జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 680 మందికి పునరావాసం కల్పించాం.

సీతారామతండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డ ఎస్సై నగేష్ కి అభినందనలు.చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తాం.ఆకేరు వాగు వరద బారిన పడుతున్న 3 తండాలను ఒకే ప్రాంతానికి తరలించి అదర్శ కాలనీ నిర్మించాలని కలెక్టర్ కు ఆదర్శం.పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి పదివేల సాయం. జాతీయ విపత్తు గా ప్రకటించాలని ప్రధాని కి లేఖ రాశాం.జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి రాష్ట్రానికి రావాలని ప్రధానమంత్రి ని కోరుతున్నాం.

వరదతో చేరిన బురదను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. నష్టం జరిగిన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఇతర ప్రాంతాల నుంచి అధికారులను రప్పించుకోవాలి. కూలి పోయిన విద్యుత్ లైన్లను తక్షణమే పునరుద్ధరించాలి.వరద ప్రమాద ప్రాంతాలు, ప్రమాదానికి కారణాలు, వాటిని ఎదుర్కొన్న తీరుపై బ్లూబుక్ ను తయారు చేసుకోవాలి... వాటిని కలెక్టరేట్లలో ఉంచాలి.

హైడ్రా తరహాలో జిల్లాలో ఒక వ్యవస్థ ను కలెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి. చెరువు లను ఆక్రమించుకోవడం క్షమించరాని నేరం. చెరువు ల ఆక్రమణలపైన రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతాం. చెరువుల ఆక్రమణలో ఎంతటి వారున్నా వదిలి పెట్టం. చెరువుల ఆక్రమణకు సహకరించిన అధికారులపైన చర్యలు తీసుకోవాలి. చెరువులు, నాలాల ఆక్రమణల జాబితా సిద్ధం చేయాలి.

మాజీ మంత్రి ఆక్రమణ వల్లనే ఖమ్మంలో వరదలు వచ్చాయనే ఫిర్యాదు లు వచ్చాయి. ఆక్రమణల తొలగింపునకు పక్కా ప్రణాళిక. అమెరికా లో జల్సా లో మునిగి తేలుతున్న ఆయన ప్రభుత్వం పైన విమర్శలు చేస్తున్నడు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా హరీష్ రావు ఖమ్మం పర్యటనకు పోయిండు. ఖమ్మం మాజీ మంత్రి ఆక్రమణలపైన తొలగింపునకు హరీష్ రావు సహకరిస్తారా?

వరదలు వచ్చినప్పుడు కేసీఆర్ పదేళ్లలో ఎప్పుడైనా పరామర్శకు వచ్చారా మాసాయిపేటలో పసిపిల్లలు చనిపోతే కేసీఆర్ పరామర్శించలేదు. హైదరాబాద్ శివారులో పశు వైద్యురాలను హత్యచేస్తే వెళ్లి చూడలేదు. మానవత్వం లేని మనిషి కేసీఆర్. ప్రతిపక్ష నేత ఎక్కడున్నాడు...ఎందుకు మాట్లాడటం లేదు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితులకు సాయం కోసం ముందు కు రావాలి.

# ప్రజల ప్రాణ రక్షణే మా ప్రభుత్వం లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి..)

సంభవించడం దురదృష్ట కరమనీ భారీ వర్షాలు, ఎగువ ఉన్న రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటితోనే మన ప్రాంతానికి విపరీతమైన నష్టం వాటిల్లిందన్నారు.

ప్రకాశం బ్యారేజీకి 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందనీ... ఎప్పుడూ రానంత వరద ఇదీ అని తెలిపారు. వరదలు తగ్గుముఖం పట్టిన తరవాత రాష్ట్రంలోని ప్రతి నగరానికీ పకడ్బందీగా ఫ్లడ్ మేనేజ్మెంట్ ప్లాన్ ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. బుడమేరు నిర్వహణ పనులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే విజయవాడకు ఇంతటి ముప్పు సంభవించిందని అన్నారు.

మంగళవారం సాయంత్రం తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఉన్న స్టేట్ ఎమర్జెన్సీ సెంటర్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర హోమ్, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఈ సమీక్షలో పాల్గొన్నారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఆ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ, విపత్తుల నిర్వహణ విభాగం డైరెక్టర్ కూర్మనాథ్ పరిస్థితిని వివరించారు.




అనంతరం పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ... "ప్రకాశం బ్యారేజ్ కు వస్తున్న వరద చూసి వర్షం కాలంలో వచ్చే సహజ వరదే అనుకున్నాం. కానీ ఎవరూ ఊహించని విధంగా రికార్డు స్థాయిలో వరద ప్రవాహం వచ్చింది. గత 50 ఏళ్లలో ఎప్పుడు ఇంత వరద వచ్చిన దాఖలాలు లేవు.

విజయవాడ ప్రాంతానికి ఇంత నష్టం జరగడానికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. చిన్న చిన్న ఇరిగేషన్ ప్రాజెక్ట్ లకు మరమత్తులు కూడా చేపట్టలేదు. బుడమేరు నిర్వహణ సక్రమంగా చేసి ఉంటే విజయవాడ ప్రాంతానికి ఇంత నష్టం వాటిల్లేది కాదు. వరద ప్రభావం తగ్గగానే భవిష్యత్తులో ఇలాంటి విపత్తు సంభవించకుండా ఫ్లడ్ కెనాల్స్ ఏర్పాటు చేస్తాం.

సీఎం అర్ధరాత్రయినా సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. వరద బాధితుల సహాయ చర్యల్లో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. అధికారులు నిద్రాహారాలు మాని పనిచేస్తున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అర్ధరాత్రి అయినా సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. నేను పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు పరిస్థితిపై సమీక్షిస్తూనే ఉన్నాను. వరద బాధితులకు సహాయం అందించడానికి పంచాయతీ రాజ్ శాఖ నుంచి 262 బృందాలను వరద ప్రభావం లేని ప్రాంతాలనుంచి బాధిత ప్రాంతాలకు తరలించాము.

193 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 42,707 మందిని తరలించాం. ముందస్తు చర్యలు, నిరంతర పర్యవేక్షణ చేసినా 20 మంది చనిపోవడం బాధాకరం. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. మరో ఇద్దరు వరద నీటిలో కొట్టుకుపోయారని అధికారులు చెబుతున్నారు.

1.72 లక్షల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. దాదాపు 6.44 లక్షల మందిపై వరదలు ప్రభావం చూపించాయి. వరద బాధితులకు ఆహారం అందించడానికి ఐదు హెలికాప్టర్లు, డ్రోన్ల ఏర్పాటు చేశాం. ప్రాణనష్టం జరగకుండా 180 బోట్లు, 282 గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశాం. కృష్ణానదిలో వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. రేపటికి 5 లక్షల క్యూసెక్కులకు తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.

### వరద బాధితులకు రూ.కోటి విరాళం

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రం హితవు కోరుకునే ప్రతి ఒక్కరూ కలిసి ముందుకు రావాలి. తమ వంతు సాయం అందించాలి. ఆస్తి, ప్రాణ నష్టం మరింత పెరగకుండా అందరం కలిసి పని చేద్దాం. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంకు మీ వంతు సహాయం అవసరం. ముఖ్యమంత్రి సహాయ నిధికి నా వంతుగా రూ.కోటి విరాళం అందిస్తున్నాను. రేపు ముఖ్యమంత్రి కి విరాళం అందజేస్తాను.

నేను వరద ప్రాంతాల్లో పర్యటించాలనుకున్నాను. కానీ వరద సహాయ కార్యక్రమాలకు ఆటంకం ఉండకూడదు. అక్కడకు వెళ్ళి అధికారులకు, సహాయక బృందాలకు అదనపు భారం కారాదు. ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తూ ఉన్నాను. ప్రజలు సహాయం కోసం 112, 1070, 18004250101 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు" అన్నారు.

# జేసీబీపైనే 22 కి.మీ ప్రయాణించిన చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి..)



మూడు రోజులుగా అన్ని ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు సీఎం తెలిపారు. అధికారులు బాధ్యత, మానవీయకోణంలో పనిచేయాలని సిఎం అన్నారు. సరిపడా ఆహార ప్యాకెట్లు పంపుతున్నా ఎందుకు చేరవేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. నీరు తగ్గని ప్రాంతాల్లో ప్రజలు పునరావాస కేంద్రాలకు రావాలని సూచించారు.

సితార సెంటర్ లో బయలు దేరిన ముఖ్యమంత్రి మళ్లీ వెనక్కి వస్తారని అధికారులు కాన్వాయ్ ను అక్కడే ఉంచారు. అయితే సీఎం అక్కడి రాకపోగా ఏ ప్రాంతానికి వస్తారో తెలియకపోవడంతో కాన్వాయ్ ను పలు చోట్లకు తిప్పారు. ప్రతి ప్రాంతాన్ని చూడాలని, సాధ్యమైనంత ఎక్కువ మందిని కలవాలని సిఎం భావించారు. దీంతో అనేక ప్రాంతాల్లో నాలుగున్నర గంటల పాటు ఆయన పర్యటన జేసీబీపైనే సాగింది. మధ్యాహ్నం భోజనం కూడా చేయకుండా సిఎం వరద బాధిత ప్రాంతాల్లోనే పర్యటించారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు వరద ప్రాంతం నుంచి బయటకు వచ్చారు. సితార సెంటర్ వద్ద వరద ప్రాంతంలో అడుగు పెట్టిన ముఖ్యమంత్రి పలు చోట్ల పర్యటించి రామవరప్పాడు వంతెన సమీపంలో సాధారణ ప్రాంతానికి చేరుకున్నారు.





సీఎం అక్కడికి వచ్చే సరికి ఆయన కాన్వాయ్ కూడా ఆ ప్రాంతానికి రాలేదు. దీంతో మరికొంత దూరం అయన జేసీబీపైనే ముందుకు సాగారు. సిఎం రూట్ పై సమాచారం అందుకున్న కాన్వాయ్ అక్కడికి చేరుకోవడంతో అక్కడ నుంచి తన వాహనంలో విజయవాడ కలెక్టర్ కార్యాలయానికి చంద్రబాబు చేరుకున్నారు.

ఈ నాలుగున్నర గంటల పర్యటనలో ఎక్కడికక్కడ అధికారులకు ఆదేశాలు, సూచనలు ఇస్తూ ముందుకు సాగారు. సీఎంతో పాటు విజయవాడ పోలీస్ కమిషనర్ కూడా పర్యటించారు. వరద కారణంగా ఇతర వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడంతో సిఎం సెక్యూరిటీలోని కొంత మంది సిబ్బంది మాత్రమే ముఖ్యమంత్రితో వెళ్లగలిగారు.

3

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 04, సెప్టెంబర్ 2024

## బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది

- రాష్ట్ర ముఖ్యమంత్రి పాలనా అనుభవం వల్ల ప్రాణనష్టం లేకుండా చూడగలిగాం
- సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ,మహానాడు:**

రాష్ట్రంలో కనీవిని ఎరుగని రైతుల్లో ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పోటెత్తింది. బ్యారేజీని నిర్మించిన తర్వాత ఇంత భారీస్థాయిలో వరదరావడం ఇదే తొలిసారి. ఇంత వరద పోటెత్తినప్పటికీ అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి దార్శనికతతో వ్యవహరించి ఎలాంటి ప్రాణం ఇస్తాం లేకుండా అధికార యంత్రాంగాన్ని నడిపించిన తీరు అద్భుతం. సహాయక చర్యల్లో ప్రభుత్వం, అధికార యంత్రాంగం, పార్టీ యంత్రాంగం పెద్దఎత్తున భాగస్వామ్యం అవుతుంది.

ముఖ్యమంత్రి రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా ప్రజలను కష్టం నుంచి బయటపడేయాలనే ఉద్దేశంతో అహర్నిశలు కృషి చేస్తున్నారు. విజయవాడ నగరంలోని అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎవరు వెళ్లలేని ప్రాంతాలకు సైతం ముఖ్యమంత్రి వెళ్లి స్వయంగా సహాయక చర్యల్లో పాల్గొని బాధితులకు భరోసా కల్పించారు.

7,20,000కు పైగా ఆహార ప్యాకెట్లను నేరుగా బాధితులకు అందజేయడం జరిగింది. ప్రతిరోజూ ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్ కు అవసరమైన ఆహార పదార్థాలను వివిధ మార్గాల ద్వారా ముంపు బాధితులకు అందజేయడం జరుగుతుంది.

వరదనీటి ప్రాంతంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. అదనపు ట్యాంకర్లు, ట్రాక్టర్ల ద్వారా సురక్షితమైన మంచినీటిని అందిస్తున్నాం. 40 వరకు డ్రోన్ల సహాయంతో మారుమూల వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఆయా




ప్రాంతాల్లో ఆహార పదార్థాలు అందిస్తున్నాం.

55 టన్నుల ఆహార పదార్థాలను హెలికాప్టర్ల ద్వారా అందజేత. ఇళ్ల చుట్టూ వరద నీరు చేరి ఉండడంతో జ్వరాలు వంటి బారినపడ్డ బాధితులకు డ్రోన్ ద్వారా మందులు కూడా అందిస్తున్నాం. 70 పునరావాస కేంద్రాల ద్వారా దాదాపు 15 వేల మందికి పునరావాసం కల్పించి వారందరికీ అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రత్యేక వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

విజయవాడ మాదిరిగానే నూజివీడులోనూ చెరువులకు గండ్లు పడడం వల్ల వరద నీరు పొలాల్లోకి వచ్చి చేరింది. కేంద్రంతో మాట్లాడి ఎన్ డీ ఆర్ ఎఫ్ బృందాలను, బోట్లను తెప్పించి వరద ప్రభావిత ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సహాయం అందించాం. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవడం జరుగుతుంది. ప్రభుత్వం అందరినీ అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి పార్థసారథి తెలిపారు.



## బెజవాడపై బ్రహ్మంగారి మాట నిజమవుతోందా?

**(వాసు)**

వీర బ్రహ్మేంద్ర స్వామి వారు కాలజ్ఞానం చెప్పారు. ఆయన ఇప్పటికి అయిదు వందల ఏళ్ళ క్రితం వారు. ఆనాడు ఆయన చెప్పిన అనేక జోస్యాలు తరువాత కాలంలో నిజం అయ్యాయి. జనాలను నిశ్చేష్టులను చేశాయి. అలాంటి జోస్యమే ఒకటి ఆయన విజయవాడ మీద కూడా చెప్పారు. బెజవాడలో కృష్ణానది ఉప్పొంగి కొండ మీద ఉన్న కనకదుర్గమ్మ ముక్కు పుడకను తాకుతుంది అని బ్రహ్మం గారు ఆనాడు రాశారు.

ఇపుడు చూస్తే విజయవాడ నిండా నీట మునిగింది. ఏకంగా మోకాల్లోతు పైగా నీళ్ళతో రోడ్లు నిండిపోయాయి. ఇళ్ళలోకి నీళ్ళు వస్తున్నాయి. బుడమేరు పొంగి పొరలి నగరం మీద పడింది. భారీ ప్రాజెక్టులు ఎపుడూ నిండవు, నిండినా అక్కడితో వాన ఉద్ధృతి ఆగడం జరుగుతుంది. కానీ ఒకే రోజు ఏకంగా 29 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు అయితే తట్టుకోవడం కష్టమే కదా.

వాగులు, వంకలు అన్నీ ఒక్కటై బెజవాడ మీదకు దండెత్తి వచ్చాయి. దాంతో నగరం నీటి మాటున దాగిపోయింది. బెజవాడలో ఎటు చూసినా నీరే కనిపించింది. ఎక్కడికీ పోని నీరుతో జనం సతమతమవుతున్నారు. జనాలు అలా బిక్కుబిక్కుమంటున్నారు.

కేవలం రెండు రోజుల పాటు కురిసిన వర్షానికి ఈ పరిస్థితి. ఇంకా మరి రెండు మూడు రోజులు భారీ వానలు కురుస్తాయని అంటున్నారు. అంతే కాదు... ఎన్టీయార్ జిల్లాకు రెడ్ అలెర్ట్ ని వాతావరణ శాఖ ప్రకటించింది. దాంతో ఈ భారీ వానలు ఏమి కొంప ముంచుతాయో అని అంతా తల్లడిల్లుతున్నారు.

ఇప్పటికే తిండి లేదు, ఆహారం లేదు, నీరు లేదు, నిద్ర లేదు ఇలా ఉంది బెజవాడ జనం పరిస్థితి. బెజవాడ ఎటు నుంచి ఎటు పోవడానికి అయినా కీలకమైన జంక్షన్. అలాంటి జంక్షన్ ఆగిపోయింది. దాంతో రైళ్ళు బస్సులు కూడా ఆగిపోయాయి. అటు నుంచి వరకూ ఇతర రాష్ట్రాల లింక్ కూడా ఆగిపోయింది.

మొత్తంమీద చూస్తే బెజవాడ ఇప్పట్లో నీటి నుంచి బయటకు వస్తుందా అన్న చర్చ కూడా సాగుతోంది. బెజవాడని బయటకు తేవడానికి తిరిగి సాధారణ పరిస్థితులు కల్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఆయన బెజవాడ వీధులలో రెస్క్యూ టీంలతో కలిసి బోట్ల మీద ప్రయాణం చేశారు. అదే విధంగా బెజవాడ సాధారణ పరిస్థితికి వచ్చేంత వరకూ తాను ఎన్టీయార్ జిల్లా కలెక్టరేట్ లోనే ఉంటాను అని కూడా బాబు ప్రకటించారు. మొత్తం మీద ఈ రకంగా వరదతో బెజవాడ నీట మునగడంతో ఇప్పటికి తాత్కాలిక చర్యలతో సరిపెడితే మాత్రం రానున్న కాలంలో ఇంతకు ఇంతా నగరం నీట మునుగుతుందని అపుడు బ్రహ్మంగారి జోస్యమే నిజం అవుతుందని జనాలు బెంగటిల్లుతున్నారు. ప్రభుత్వం తక్షణం శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. అంతే కాదు ఆక్రమణలను తొలగించి బెజవాడను నీరు పల్లమెరుగు అన్నట్లుగా తీర్చిదిద్దాలని అంతా కోరుకుంటున్నారు.

### వైసీపీ నేతల ఇసుక దందాతో

## బుడమేరుకు గండ్లు!

- గత ఐదేళ్ళు బుడమేరు ఎరుగని జగన్
- నేడు ప్రభుత్వంపై బురద చల్లేందుకు వచ్చారు
- విపత్తుల సమయంలో జగన్ బాధితుల పక్షాన నిలబడలేదు
- ఐదేళ్ల పదవీకాలంలో సాయంత్రం 5 తరువాత బయటకు రాని జగన్
- ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రజా హితం కోరాలి
- జగన్ రెడ్డి ఫేక్ ప్రచారం మానుకోవాలి... విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలి
- చంద్రబాబు ఇంటికోసం బుడమేరు నీరు డైవర్ట్ చేశారని చెప్పడం జగన్ తెలివితక్కువతనం
- వరద బాధితుల కోసం నిలబడిన భగీరథుడు చంద్రబాబు
- యంత్రాంగం, నేతలు, హెలికాప్టర్లు, బోట్లు, డ్రోన్లతో యుద్ధప్రాతిపదికన పనులు
- ఇది చంద్రబాబు వలనే సాధ్యం
- అమరావతిపై తప్పుడు ప్రచారాలు సిగ్గుచేటు
- స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం చేయడంలో చంద్రబాబు పాత్ర కీలకం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్

**మంగళగిరి, మహానాడు:**

దొంగే దొంగా దొంగా అన్నట్టు జగన్ తీరు ఉందని... గత ఐదేళ్లు బుడమేరును గాలికొదిలేసిన జగన్... నేడు ప్రభుత్వంపై బురద చల్లేందుకు రావడం సిగ్గుచేటని.. బకాసురుల్లా ఇసుకను బొక్కి.. బుడమేరుకు గండ్లు కొట్టారని.. నేడు బెజవాడ ప్రజల కన్నీటి వ్యథకు వైసీపీ నేతలే ప్రధాన కారణమని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే...

చెత్త రాజకీయాలు కాదు... ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రజా హితం కోసం పనిచేయాలి. వైసీపీ మత్తులో ఉన్న అధికారులు ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నా కూడా మీన మేషాలు లెక్కేయడం క్షమించరాని నేరం. ముంపు ప్రాంతాలకు వచ్చిన జగన్ ప్రజలకు సాయం చేయకపోగా రాజకీయ బురద చల్లి వెళ్ళారు. విపత్తుల సమయంలో బాధితుల పక్షాన జగన్ ఒక్కరోజు కూడా నిలబడలేదు. ఐదేళ్ల పదవికాలంలో సాయంత్రం 5 తరువాత ఒక్క రోజు కూడా బయటకు రాలేదు. గత ఐదేళ్లలో ప్రజల క్షేమం కోసం జగన్ ఒక్క ప్రెస్ మీట్ కూడా పెట్టలేదు.

నేడు కలెక్టరేట్‌లో బసచేసి బస్సులో నివాసం ఉంటూ.. చంద్రబాబు నేరుగా బాధితుల వద్దకు వెళ్ళి వారి కష్టాలను తెలుసుకుని వారి కన్నీళ్లను తుడుస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నారు. జగన్ కుటిల బుద్ధిని ప్రజలు గమనిస్తున్నారు. విమర్శలు చేస్తే అవి నిర్మాణాత్మకంగా ఉండాలి. కాని తప్పుడు ప్రచారం చేస్తారా? ముఖ్యమంత్రే స్వయంగా ఫీల్డ్‌లో ఉన్నారు



కాబట్టి యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం వలన 10 ఎన్డీఆర్ ఎఫ్ టీమ్ లతో తక్షణ సహాయ చర్యలు చేపట్టారు. అయినా తప్పుడు నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఒక ముఖ్యమంత్రిగా ప్రజలకోసం చంద్రబాబు పడుతున్న తపన మాకు గర్వకారణంగా ఉంది. ఎన్డీఆర్ ఎఫ్ టీమ్‌లు, ఎలికాప్టర్లు, బోట్స్ తీసుకు వచ్చి నిరంతరం బాధితుల పక్షాన నిల్చొని చంద్రబాబు భరోసా కల్పిస్తున్నారు. ఇది ప్రతి ఒక్కరు హర్షించాల్సిన విషయం.

ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు అందరూ బాధితులకు సహాయం చేస్తున్నారు. జగన్ రెడ్డి విమర్శలు చేసేప్పుడు ఆలోచించాలి. జగన్ రెడ్డి ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే నాలుగుగోడల మధ్య ఉన్నారు తప్పా ఏనాడు బయటకు రాలేదు. పరదాలు చాటున తిరిగి, చెట్లు నరికించారు... వేల సంఖ్యలో పోలీసుల పహారాను పెట్టుకుని తిరిగారు. అలాంటి నేతలు మీరు మళ్ళీ విమర్శలు చేస్తారా? చంద్రబాబు నివాసం మునిగిపోతుందని... బుడమేరు నీరు డైవర్ట్ చేశారని నీచంగా అబద్దాలు చెబుతారా? అసలు బుడమేరు కట్టలు కోతకు గురవ్వడానికి మీ అక్రమ మైనింగే కారణం.

విజయవాడకు రిటైనింగ్ వాల్ టీడీపీ హయాంలోనే 90% పూర్తి చేశారు. అదే నేడు ప్రజలను కాపాడింది. అమరావతిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. 13 లక్షల క్యూసెక్ నీరు వచ్చినా అమరావతిలో ఎక్కడా నీరు నిలబడలేదు. గత ఐదేళ్లు అమరావతిపై అనేక ఆరోపణలు చేశారు. వాటిని ప్రజలు గమనిస్తున్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం చేయడంలో చంద్రబాబు పాత్ర కీలకంగా ఉంటుంది. తప్పుడు ప్రచారాలు చేస్తున్న వైసీపీని ప్రజలే పాతిపెడతారు.

## కృష్ణలంక రిటైనింగ్ వాల్ కట్టిందెవరు?

- 'వాల్'పై పొలిటికల్ వార్

**(రమణ)**

నిజానికి కృష్ణలంకకు – కృష్ణా నదికి అడ్డుగా రీటైనింగ్ వాల్ 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో పరిశీలన, ఎస్టిమేషన్స్ కూడా జరిగాయి. 2011లో ఎస్టిమేషన్ రూ . 40 కోట్లు. తర్వాత 2014 కి 93.22 కోట్లు చేశారు.

2014లో విభజిత ఆంధ్రలో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత, ఎస్టిమేట్లను రూ.104 కోట్లకు పెంచి, 2014లో టెక్నికల్ శాంక్షన్ ఇచ్చారు. రామలింగేశ్వర నగర్ నుంచి యనమల కుదురు దాకా రిటైనింగ్ వాల్ కట్టడానికి .

M/s SEW & PMPL joint venture, కంపెనీలకు June 2, 2015న Rs 93.22 కోట్లకు (–)5.40% లెస్ కింద – ఇంకొక కంపెనీ వేసిన ECV Rs.98. 54 కోట్లతో పోల్చి – రెండేళ్ల వ్యవధితో ఇచ్చారు. కానీ Krishna Delta Chief Engineer శ్రీనివాస్ తన December 8, 2016 న చేసిన ఇన్స్పెక్షన్ లో కొన్ని మార్పులు సూచించారు. రిటెయినింగ్ వాల్ కట్టేటప్పుడు ఆ deviations అవసరమయ్యాయని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఇసుకతో కూడిన మట్టిలో కాంక్రీట్ పైల్స్ కాకుండా ఐరన్ స్టీల్ కేసింగ్ వేస్తే పటిష్ఠంగా వుంటుందనే సూచనను తెలుగుదేశం ప్రభుత్వం పరిగణనలోనికి తీసుకొంది.

ప్రభుత్వం దాన్ని ఒప్పుకొని revised ఎస్టిమేట్స్ ప్రకారం రీటెయినింగ్ వాల్ అంచనాలని 2017 లో రూ. 138 కోట్లకు పెంచి డబ్బులు రిలీజ్ కూడా చేసింది. 2018 నాటికి ఆ జాయింట్ వెంచర్ కాంట్రాక్ట్ కంపెనీ 40% పనులు పూర్తి చేసింది. రిటైనింగ్ వాల్ కు సంబంధించిన ఇది మొదటి ఫేజ్.



కోటి నగర్ నుండి యనమలకుదురు వరకు.

ఫేజ్ 2 – వారధి నుండి కోటి నగర్ వరకు, ఫేజ్ 3 – పద్మావతి ఘాట్ నుండి వారధి వరకు. మూడో ఫేజ్ ఇంకా పూర్తిగా అవలేదు.

స్థూలంగా చెప్పాలంటే, విభజన ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అనుకొంది. విభజన తర్వాత 2014–19 ఫేజ్ 1, తెలుగుదేశం ప్రభుత్వం మొదలుపెట్టింది, నిధులు విడుదల చేసింది. దాదాపు పూర్తి అయింది. ఫేజ్ 2.. 2019–24 మధ్యలో జగన్ ప్రభుత్వం పూర్తి చేసింది.

### వరద బాధితులకు ఉద్యోగుల

## ఒక రోజు వేతనం రూ.100 కోట్లు విరాళం

- ప్రకటించిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

**హైదరాబాద్, మహానాడు:**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం తగు సహాయక చర్యలను సైతం వేగవంతం చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగుల సైతం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారని గుర్తు చేశారు. అయినప్పటికీ విపత్తు భారీగానే నష్టాన్ని కలిగించిందన్నారు. ఈ ఘటన తమను తీవ్రంగా కలిచివేసిందన్నారు. కొత్తప్రభుత్వం ఏర్పడిన తర్వాత దీనిని అతిపెద్ద విపత్తుగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ భావించిందన్నారు.

ఇలాంటి సమయంలో తమ వంతుగా ప్రభుత్వానికి ఆర్థిక పరంగా చేయూతగా నిలవాలని భావించామని, అందులో భాగంగా రాష్ట్రంలోని ఉద్యోగుల తరుపున ఒక రోజు వేతనం




సుమారు రూ.100 కోట్లను ప్రభుత్వానికి ఇచ్చేందుకు స్వచ్ఛందంగా నిర్ణయించినట్టు తెలిపారు. తెలంగాణలోని అన్ని ప్రభుత్వ విభాగాలలోని ఉద్యోగుల తరుపున సమిష్టి నిర్ణయం తీసుకున్నామని, ప్రభుత్వంలో భాగంగా ఉన్న ఉద్యోగులుగా వరద విపత్తు సృష్టించిన ప్రాంతాల్లో ప్రత్యక్షంగా సహాయక చర్యలలో పాల్గొనడంతో పాటు తమ బాధ్యతగా ఒక రోజు వేతనాన్ని విరాళంగా అంద చేయనున్నట్టుగా చెప్పారు.

## 'పేటీఎం ముఠాల'పై నిఘా!

- వాట్సప్‌లో ఫేక్ న్యూస్ ఉంటే అడ్మిన్ బాధ్యుడు
- వదంతుల వ్యాప్తిపై సర్కార్ సీరియస్
- సహాయక చర్యలపై విష ప్రచారం చేస్తే చర్యలు

**విజయవాడ, మహానాడు:**

ప్రకృతి విపత్తు వరదల రూపంలో విరుచుకుపడి విలయం సృష్టించింది. కష్ట సమయంలో ప్రభుత్వం సర్వశక్తులతో సహాయ చర్యలు చేపడుతోంది. అయితే, కొందరు దురుద్దేశపూర్వకంగా ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తున్నారు. బాధితులకు సాయం అందించడంలో సమస్యలు ప్రభుత్వం దృష్టికి తేవడం మాని.. ఫేక్ న్యూస్ ను విపరీతంగా మార్ఫింగ్ చేసి ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారు. ఇటువంటి పేటీఎం ముఠాలపై పోలీసులు నిఘా పెట్టారు. తప్పుడు ప్రచారం చేస్తూ వరద బాధితులను ఆందోళనకు గురి చేస్తున్న ఓ వర్గం మీడియా, పేటీఎం బ్యాచ్లపై, ఈ ఫేక్ న్యూస్ వ్యాప్తి జరుగుతున్న వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లపై పోలీసులు దృష్టిసారించారు.




ఫేక్ న్యూస్, వరదలపై వదంతులు, బాధితులకు అందే సహాయంపై విష ప్రచారం ఏ వాట్సాప్ గ్రూప్ ద్వారా స్ప్రెడ్ అయినా ఆ గ్రూప్ అడ్మిన్ దానికి బాధ్యత వహించాల్సి ఉంటుందని, అడ్మిన్‌లపై చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరిస్తోంది. ఓ వర్గం మీడియా, పేటీఎం బ్యాచ్ లో పంపిస్తున్న ఫేక్ న్యూస్ గ్రూపుల్లో షేర్ చేయకుండా కొందరు అడ్మిన్లు ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకుంటున్నారు. కొందరు ఫేక్ న్యూస్‌ని మరింత మందికి చేరేలా షేర్ చేస్తున్నారు. ఇటువంటి వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లపై సైబర్ క్రైమ్ పోలీసులు పూర్తిస్థాయి దృష్టి సారించారు. వీరంతా ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వంపై బురదజల్లేందుకు, ప్రజలను భయాందోళనకు గురిచేసేందుకు ఇటువంటి ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తున్నారని నిర్ధారించుకున్నారు. వీరిపై ఓ కన్నేసి ఉంచారు.

4

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 04, సెప్టెంబర్ 2024






# ముంపు ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు

- మంత్రి లోకేష్ పర్యవేక్షణ
- సీఎం పిలుపుతో వెల్లువెత్తిన విరాళాలు

**విజయవాడ, మహానాడు:**

విజయవాడ, పరిసర ముంపు ప్రాంతాల్లో వరద సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మంత్రి లోకేష్ వీటిని పర్యవేక్షిస్తున్నారు.

- వరద సహాయ చర్యల్లో భాగంగా మెరుగైన సేవల కోసం ప్రతీ వార్డుకు ఒక శాసనసభ్యుడికి బాధ్యతలు.
- ఇప్పటికే వార్డులు వారీగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారులు.
- రాష్ట్రవ్యాప్తంగా దాతల నుంచి విరాళాలు, మంత్రి లోకేష్‌కు చెక్కులు అందజేత.



- మంగళగిరి నియోజకవర్గంకు చెందిన కళ్లం రాజశేఖర్ రెడ్డి రూ.10 లక్షలు, కొమ్మారెడ్డి కిరణ్ రూ.10 లక్షలు విరాళం.
- వీరితో పాటు ఏవీ రమణారెడ్డి రూ.7 లక్షలు, ఒంగోలుకు చెందిన మేదరమెట్ల సుబ్బయ్య రూ.లక్ష, ఆలూరు కొండలరావ్ రూ.50 వేలు, ఆలూరి ఝాన్సీలక్ష్మీ రూ.50 వేలు చొప్పున విరాళం అందజేత.
- వాంబే కాలనీ, అజిత్ సింగ్ నగర్, జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీ, న్యూ రాజీవ్ నగర్ ప్రాంతాల్లో ఉదయం నుంచి హెలీకాప్టర్ల ద్వారా 42 వేల కిలోల ఆహారం, వాటర్





బాటిళ్లు, పండ్లు జారవేత.

- వరద సహాయ చర్యలపై మంత్రులు పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కేశినేని చిన్ని, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్‌లతో లోకేష్ సమన్వయం.
- కృష్ణానదిలో తగ్గుముఖం పట్టిన వరద. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ వద్ద 7,91,311 క్యూసెక్కుల వరద ప్రవాహం.

# ప్రభుత్వేతర రంగంలో 'అందుబాటు ధర'కే ఆరోగ్య సంరక్షణ సేవలకు భారీ డిమాండ్

- పీపీపీ కింద ఏపీలో 175 ఆసుపత్రులు, మెగా హెల్త్ సిటీ ఏర్పాటు
- నియోజకవర్గానికో ఆసుపత్రి ఉండాలనేది ప్రభుత్వ ఆలోచన
- ప్రభుత్వాసుపత్రుల్లో రోగనిర్ధారణ, చికిత్స సౌకర్యాల మెరుగుకు కృషి
- ఏపీలో పెట్టుబడి అవకాశాలను ఫ్లోరిడాలో వివరించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్
- వైద్య ఆరోగ్య రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు విశేషమైన అవకాశాలు
- రంగరాయ, సిద్ధార్థ, గుంటూరు వైద్య కళాశాలల పూర్వ విద్యార్థుల ద్వైవార్షిక సదస్సులో మంత్రి కీలకోపన్యాసం

**ఫ్లోరిడా,మహానాడు:**

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వర్గాల ప్రజలకు ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటులోకి తెచ్చే విధంగా రాష్ట్ర వైద్యఆరోగ్య రంగాన్ని మెరుగుపర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఆరోగ్య రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు విశేషమైన అవకాశం, సామర్థ్యాలు ఉన్నాయని చెప్పారు.

అమెరికాలోని ఫ్లోరిడా నగరంలో స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం జరిగిన.. రంగరాయ, సిద్ధార్థ, గుంటూరు వైద్య కళాశాలల పూర్వ విద్యార్థుల ద్వైవార్షిక సదస్సుకు మంత్రి సత్యకుమార్ హాజరయ్యారు. వారిని ఉద్దేశించి కీలకోపన్యాసం చేసిన ఆయన... ఆంధ్రప్రదేశ్‌లోని ఆరోగ్య రంగంలో ఉన్న సవాళ్లు, అవకాశాల గురించి సుదీర్ఘంగా మాట్లాడారు.

మారుతున్న ప్రజల ఆరోగ్య పద్ధతులు, పెరుగుతున్న ఆదాయాల కారణంగా... సమాజంలోని ఎక్కువ శాతంగా ఉన్న పేద, మధ్యతరగతి వర్గాలకు అందుబాటు ధరలకే వైద్యం అందించేందుకు... ఉచిత వైద్యం అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, కార్పొరేట్ ఆసుపత్రులతో సహా ప్రైవేట్ ఆసుపత్రులకు భారీ అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. స్పెషాలిటీ హెల్త్‌కేర్ సేవలతో సహా పేద, అల్పాదాయ వర్గాలకు ప్రజారోగ్య సంరక్షణ సేవలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం మెరుగ్గా కృషి చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

వైద్యసేవల విషయంలో ప్రజలకున్న డిమాండ్లను తీర్చడంలో ప్రైవేట్ ఆసుపత్రులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని, 'కార్పొరేట్ హెల్త్‌కేర్' పెద్దఎత్తున అభివృద్ధి చెందుతోందని ఆయన అన్నారు. అయితే అధిక ఖర్చుల కారణంగా ప్రైవేట్ వైద్యం ఎక్కువ మంది ప్రజలకు అందుబాటులో లేదని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

సరసమైన ధరలకే ఆరోగ్య సంరక్షణ సేవలకు ఉన్న డిమాండ్, సరఫరా మధ్య ఉన్న ఈ వ్యత్యాసాన్ని తగ్గించడానికి, రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో పెట్టుబడులను ప్రోత్సహించాలని యోచిస్తోందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆరోగ్య రంగంలో ఉన్న గణనీయమైన పెట్టుబడి అవకాశాలను ఆయన ఆవిష్కరించారు.

### వీటిలో కొన్ని ఏంటంటే...

1.రాష్ట్రంలోని మొత్తం 175 అసెంబ్లీ నియోజక వర్గాల్లోని ఆసుపత్రులను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయడం ద్వారా... అందుబాటు ధరలకే వైద్య సేవలను ఆశించే అన్ని వర్గాల ప్రజలకు, వారి 'స్థోమత'కు తగిన ఆరోగ్య సంరక్షణను



అందించవచ్చని, సరసమైన ధరలకే స్పెషాలిటీ సేవలతో సహా ఆరోగ్య సంరక్షణ సేవలను కల్పించవచ్చని చెప్పారు.

దీనికి ఉదాహరణగా ఒక ట్రస్ట్ నిర్వహిస్తున్న ఆసుపత్రి గురించి వివరించారు. నామమాత్రపు ఔట్ పేషెంట్ (ఓపీ) రుసుము మాత్రమే వసూలు చేస్తున్న ఆ ఆసుపత్రి... నాణ్యమైన సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ పద్ధతుల వల్ల ప్రస్తుతం ఉన్న సామర్థ్యానికి మరో 17,500 పడకలు జోడించవచ్చని వెల్లడించారు. ఈ ఆసుపత్రులకు రాష్ట్ర ప్రభుత్వం భూమిని సమకూరుస్తుందన్నారు.

రాజధాని ప్రాంతంలోని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమిలో మెగా మెడిసిటీని అభివృద్ధి చేస్తాం. కేంద్ర ప్రభుత్వం కూడా దీనిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహాయం చేస్తుంది. ఈ మెడిసిటీలోని పీపీపీ సిటీలో అనేక రకాల ఆరోగ్య సంరక్షణ సంబంధిత సంస్థలను ప్రోత్సహిస్తాం.

రాష్ట్రంలో మంజూరైన 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని 10 కళాశాలలు, అలాగే అటెండెంట్ టీచింగ్ ఆసుపత్రులను కూడా పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసే విధంగా పెద్ద ఎత్తున పెట్టుబడి అవకాశాలను పెంచుతాం.

మెరుగైన సేవలు అందించడం కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వివిధ రోగనిర్ధారణ పరికరాలు, అలాగే యంత్రాల డిమాండ్ – లభ్యత మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించాలని ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. దీంతో క్యాథ్ ల్యాబ్‌లు, సీటీ స్కాన్‌లు, ఎమ్ఆర్ఐ, క్యాన్సర్ డయాగ్నస్టిక్ మెషీన్ల ఏర్పాటులో పెట్టుబడులకు అనుమతి ఉంటుంది.

రాష్ట్రంలో ప్రజలందరూ వినియోగించుకునేలా, వారికి అందుబాటు ధరలో ప్రజారోగ్య సంరక్షణను అందించడంలో వనరుల పరిమితి ప్రధాన అడ్డంకిగా మారిందని మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. "2019–24 మధ్యలో ఆర్థిక దుర్వినియోగం, నిర్వహణ వైఫల్యం వల్ల పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. అన్ని రంగాల్లోనూ గత ప్రభుత్వ వైఫల్య వారసత్వాన్ని కొనసాగనీయకుండా చేసేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని మంత్రి స్పష్టం చేశారు.

అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల పనితీరులో మార్పు తీసుకురావడానికి, అలాగే విస్తృతమైన సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు, వీటిని పెద్ద సంఖ్యలో సందర్శించే సామాన్య ప్రజలకు ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచడానికి ఇటీవల రూపొందించిన 30 పాయింట్ల కార్యాచరణ ప్రణాళికను కూడా ఆరోగ్య మంత్రి వివరించారు.

గుంటూరు మెడికల్ కాలేజ్ – గుంటూరు, రంగరాయ మెడికల్ కాలేజ్ – కాకినాడ, సిద్ధార్థ మెడికల్ కాలేజ్ – విజయవాడ, ఇంకా ఇతర ప్రభుత్వ వైద్య కళాశాలల పూర్వ విద్యార్థులను మంత్రి సత్యకుమార్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు.

# సురక్షిత ప్రాంతాలకు 154 మంది గర్భిణుల తరలింపు

- పునరావాస కేంద్రాలకు అనుబంధంగా 14 వైద్య శిబిరాలు
- అదనంగా 20 సంచార వైద్య శిబిరాలు
- వైద్యశిబిరాల ద్వారా 17538 మంది రోగులకు సేవలు
- 108 అంబులెన్స్ లు 25 అందుబాటులో ఉంచాం
- ప్రభుత్వాసుపత్రుల్లో అదనంగా 100 పడకలు
- 75 వేల అత్యవసర మందుల కిట్లు
- వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు

**అమరావతి,మహానాడు:**

తదుపరి 10 రోజుల్లో ప్రసవించే 154 మంది గర్భిణిలను వైద్య ఆరోగ్య శాఖ సురక్షిత ప్రాంతాలకు చేర్చిందని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ ఏర్పాటులలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రజలకు అత్యవసర ఆరోగ్య సేవల్ని అందించేందుకు అనేక కార్యక్రమాల్ని చేపట్టిందన్నారు.

పునరావాస కేంద్రాలకు అనుబంధంగా 14 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడంతో పాటు వీటికి అదనంగా 20 సంచార వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేసి వైద్య సేవల్ని అందించిందన్నారు. ఈ వైద్య శిబిరాల ద్వారా ఇప్పటివరకు 17,538 మంది రోగులు సేవల్ని అందుకున్నారన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా విజయవాడ నగరంలో పలు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకోవడంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాల్ని చేపట్టి, ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి తగిన వసతుల్ని కల్పించిందని ఆయన పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. విజయవాడ నగరంలో 32 వార్డ్స్ జల దిగ్బంధంలో చిక్కుకొన్న దృష్ట్యా అందరకి 6 రకములైన అత్యవసరమైన మందులను, వాటిని వాడే విధానం తెలియచేసే కర పత్రాన్ని జత చేస్తూ సుమారు 75,000 కిట్స్‌ను హెలి





కాప్టర్ ద్వారా, బోట్స్ ద్వారా మరియు రోడ్డు మార్గములో అందించడం జరుగుతోందన్నారు. అత్యవసర వైద్యసేవల కోసమై అదనంగా ఇరవై అయిదు 108 అంబులెన్సులను అందుబాటులో ఉంచామన్నారు. వరదల కారణముగా వ్యాధులు పెరిగి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల కోసమై వచ్చే రోగుల సౌలభ్యం కోసం అదనంగా 100 పడకలను ఏర్పాటు చేశామన్నారు.

వివిధ కాలనీల్లో నీటిమట్టం తగ్గు ముఖం పడుతున్న దృష్ట్యా సంక్రమిత వ్యాధులు ప్రబలే అవకాశం వున్నందున విస్తారమైన వైద్య సహాయక ఏర్పాట్లు చేయడం జరుగుతోందన్నారు. వీటిలో భాగంగా 32 వార్డ్స్‌లో 64 వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతోందని, ఈ వైద్య శిబిరాలలో రోగులకు అవసరమగు వైద్య పరీక్షలు చేసి ఉచితముగా మందులను అందిస్తారన్నారు.

ఈ 32 వార్డ్స్, అధిక నష్టమైన 5 సమీప గ్రామీణ ప్రాంతాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ అనుబంధంగా సంచార వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ శిబిరాలలో 200 రకముల మందులను సిద్ధంగా ఉంచామన్నారు. వైద్య సేవలు అందించడంలో తగిన సూచనలు మరియు సౌకర్యాలు పొందుపరచడం కోసమై ఉన్నత అధికారులతో 10 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఆరోగ్య సూచనలు ,సలహాలు మరియు సేవలు అందించడం కోసమై విస్తృతమైన ప్రచార కార్యక్రమాల్ని చేపడుతున్నామని, పై కార్యక్రమాల పర్యవేక్షణ కోసం ఒక ప్రత్యేకమైన కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేశామన్నారు.


# తండ్రిని పట్టించుకోని కొడుకు... గిఫ్ట్ డీడ్ రద్దు!

- 6 ఎకరాల భూమిని తిరిగి తండ్రి పేరిట మార్చిన పెద్దపల్లి కలెక్టర్
- తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని ప్రకటన

**ధర్మారం, మహానాడు:**

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదంటూ కొడుకు పేరిట చేసిన ఆస్తి గిఫ్ట్ డీడ్ను తిరిగి తండ్రి పేరిట బదిలీ చేస్తూ పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పైడిచింతలపల్లి గ్రామానికి చెందిన గడ్డం బాపురెడ్డి తన కుమారుడైన గడ్డం స్వామిరెడ్డికి వివిధ సర్వే నంబర్లలోని తనకున్న 6 ఎకరాల 5 గుంటల భూమిని గిఫ్ట్ డీడ్ చేశారు. అయితే కొంతకాలంగా తన బాగోగులు చూసుకోవట్లేదని కొడుకుపై పెద్దపల్లి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన ఆర్డీవో.. స్వామిరెడ్డికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా కొడుకు ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో విసిగిపోయిన బాపురెడ్డి గతంలో తన కొడుకు పేరిట చేసిన గిఫ్ట్ డీడ్ను రద్దు చేసేందుకు దరఖాస్తు సమర్పించారు. ఆ దరఖాస్తును అప్పీలుగా స్వీకరించి ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి కలెక్టర్ కార్యాలయంలో విచారణ జరిపారు.

ఆర్డీవో ఉత్తర్వుల అమల్లో స్వామిరెడ్డి నిర్లక్ష్యం వహించినట్టు కలెక్టర్ నిర్ధారించారు. దీంతో వయోవృద్ధుల సంక్షేమ చట్టం-2007 ప్రకారం గడ్డం బాపురెడ్డి కొడుకు పేరిట చేసిన గిఫ్ట్ డీడ్ను







రద్దు చేసి తిరిగి తండ్రి పేరిట బదిలీ చేయాలని నిర్ణయించారు. అలాగే తండ్రి పోషణకు ప్రతి నెలా రూ. 10వేలను ఆయన బ్యాంకు ఖాతాలో జమ చేయాలని కుమారుడు స్వామి రెడ్డి, కుమార్తె సింగిరెడ్డి లతను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని అధికారులను ఆదేశిం చారు. తల్లిదండ్రుల బాగోగులను చూసుకోవాల్సిన బాధ్యత సంతానంపై ఉంటుందని.. ఈ విషయంలో నిర్లక్ష్యం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# వరద బాధితులను టీటీడీ, శ్రీకాళహస్తి ఆదుకోవాలి

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విజ్ఞప్తి

**చిత్తూరు, మహానాడు:**

ఏపీ వరద బాధితులకు టీటీడీ, శ్రీకాళహస్తి దేవస్థానాలు ఆదుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విజ్ఞప్తి చేశారు. టీటీడీ నుంచి రూ.10 కోట్లు, శ్రీ కాళహస్తి దేవస్థానం రూ.5కోట్లు మంజూరు చేయాలని కోరారు. టీటీడీ ఆధ్వర్యంలో విజయవాడ, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. ఏపీలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పునరావాస కేంద్రాల్లో సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఆహారం, మంచినీళ్లు, పాలు, దుస్తులు సరఫరా చేసి ఆదుకోవాలి. అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. అనారోగ్యం బారిన పడిన రోగులకు, వైద్యం, మందులు ఉచితంగా ఇవ్వాలి. చాలా చోట్ల ప్రజలు ఇంకా వరద ముంపులో ఇరుక్కుని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. సురక్షిత ప్రాంతాలకు వాహనాలు ఏర్పాటు చేసి, ప్రజలను తరలించాలి.

టీటీడీ ధార్మిక సంస్థ.... ఏపీకి వచ్చిన ఆపదను గుర్తించి, తక్షణ సాయంగా నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడంలో ఏపీ,



తెలంగాణ ప్రభుత్వాలు చూపిస్తున్న చొరవ, కృషి ప్రశంసనీయం... అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరువురూ మంచి అడ్మినిస్ట్రేటర్స్. ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. వరద బాధితులకు అండగా నిలిచి, ఆపత్కర సమయంలో ఆదుకోవాలి. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు ఒక నెల జీతభత్యాలను వరద బాధితులకు సాయం కోసం ఖర్చు చేయాలి. టీటీడీ ఉద్యోగస్తులు, ప్రభుత్వ ఉద్యోగులు ఒక్కరోజు వేతనాన్ని ఇవ్వాలని ఆయన అభ్యర్థించారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
5
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 04, సెప్టెంబర్ 2024

# లక్షకోట్లు తిన్న జగన్
# జనం కోసం వందకోట్లివ్వలేరా?

- బుడమేరుకు గేట్లు నువ్వు-మీ తండ్రి కట్టారా జగన్?
- మహిళా మంత్రికి ఉన్న చిత్తశుద్ధి కూడా లేదా?
- హోంమంత్రి అనిత పాటి శ్రద్ధ కూడా లేని జగన్
- ఈ విజిటింగ్ ప్రొఫెసర్ మాకెందుకు?
- వరదలోనూ బురద రాజకీయమేనా?
- టీడీపీ మహిళా నేత అన్నాబత్తుని జయలక్ష్మి ఫైర్



గుంటూరు,మహానాడు:

తండ్రి అధికారం అడ్డుపెట్టుకోవడంతోపాటు, ఐదేళ్లు సీఎంగా ఉండి అడ్డగోలుగా సంపాదించిన లక్షకోట్ల ఆస్తిపరుడు జగన్ వరద బాధితులకు వందకోట్లు ఇవ్వలేరా? సీఎం రిలీఫ్ ఫండ్‌కు కనీసం వందకోట్లు ఇచ్చే పెద్ద మనసుకూడా లేదా? పోగేసుకోవడమే తప్ప, పంచిపెట్టే గుణం లేదా? అని వైసీపీ అధినేత జగన్‌పై, గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మి ప్రశ్నల వర్షం కురిపించారు.

సర్వం కోల్పోయిన విజయవాడ ప్రజలకు మనోస్థైర్యం కలిగిస్తూ సీఎం చంద్రబాబు, 74 ఏళ్ల వయసులో కూడా తెల్లవారే వరకూ నీళ్లలో తిరుగుతున్నారని గుర్తు చేశారు. కానీ యువకుడైన జగన్ మాత్రం బెంగళూరులో విలాసవంతమైన జీవితం గడుపుతూ, విజిటింగ్ ప్రొఫెసర్ మాదిరిగా అప్పుడప్పుడూ రాష్ట్రానికి వస్తున్నారని విమర్శించారు. ఒకరోజు విజయవాడకు వచ్చిన జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం దారుణమన్నారు. ఇలాంటి కళ్లుండీ చూడలేని కబోది విజిటింగ్ ప్రొఫెసర్ ఈ రాష్ట్రానికి అవసరమా? అని ప్రశ్నించారు.

భారీ వర్షాల్లో సైతం మహిళా హోంమంత్రి వంగలపూడి అనిత బాధితుల కోసం అహర్నిశలు కష్టపడుతుంటే, జగన్ మాత్రం కష్టాల్లో ఉన్నవారిపై రాళ్లు వేసి బాధితుల ఆత్మస్థైర్యం దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. బుడమేరుకు గేట్లున్నాయని చెప్పిన జగన్ వ్యాఖ్యలు చూస్తే, ఇంత అజ్ఞాని ఈ రాష్ట్రానికి ఐదేళ్లుగా సీఎంగా ఉండటం ప్రజల దౌర్భాగ్యమని అర్థమవుతోందన్నారు.

బుడమేరులో నువ్వుగానీ, మీ నాన్న గానీ గేట్లు పెట్టారా జగన్? అని ప్రశ్నించారు. జనం కష్టాల్లో ఉంటే పాలకుడు ఎలా పనిచేస్తారో చంద్రబాబును చూసి నేర్చుకోవాలని జయలక్ష్మి హితవు పలికారు.

# బిఆర్ఎస్ బృందంపై కాంగ్రెస్ దాడి పిరికిపంద చర్య

- రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు డిమాండ్ చేసిన విధంగా చనిపోయిన వారి 25 లక్షలు,పంట నష్టంకు ఎకరాకు 30 వేలు ఇచ్చి వరద బాధితులను ఆదుకోవాలి
- మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్,మహానాడు:

ఖమ్మం జిల్లాలో వరద బాధితుల పరామర్శకు వెళ్లిన వెళ్లిన మాజీ మంత్రి , శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు మరియు అందులో ప్రయాణిస్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్, జగదీశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, రాజ్యసభ ఎంపీ రవిచంద్ర కార్లపై కాంగ్రెస్ వాళ్లు దాడి చేయడం పిరికిపంద చర్య అని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.



ఈ దాడులకు బిఆర్ఎస్ పార్టీ టీఆర్ఎస్ నాయకత్వం భయపడదు.కాంగ్రెస్ గుండాలు దాడులు చేస్తా ఉంటే అక్కడ ఉన్న పోలీస్ యంత్రాంగం నిమ్మకు నీరు ఎత్తినట్టు ఉన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా వరదల్లో చిక్కుకొని ఇబ్బంది పడుతున్న మాకు న్యాయం చేయలేకపోయారు అని ప్రజలు ఛీకొడుతుంటే సి.ఎం నుండి మంత్రుల దాకా ఇంకా బిఆర్ఎస్ ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు.

గత వరదల సమయంలో కేసీఆర్ ప్రభుత్వం బిఆర్ఎస్ నాయకత్వం స్పందించిన తీరును అక్కడి ప్రజలు గుర్తు చేసుకుంటూ మీడియా సాక్షిగా చెబుతుంటే కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు.అందుకే క్షేత్ర స్థాయిలో వరద బాధితులను కలవడానికి వెళ్లిన మా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలపై దాడులు చేస్తున్నారు.

వాతావరణ శాఖ భారీ వర్షాలు ఉన్నాయి అని ముందుగానే హెచ్చరించారు. ఈ ప్రభుత్వం పెడ చెవిన పెట్టిందని ఇప్పుడు జరగాల్సిన నష్టం జరిగాక మొసలి కన్నీరు కారుస్తూ బిఆర్ఎస్ పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు అని అన్నారు.

వరద ప్రాంతాలను పరిశీలించడానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఎదో ఎన్నికల ప్రచారం నిర్వహించినట్టుగా ప్రచార రథం మీద ఉండి చేతులు ఊపుకుంటూ ర్యాలీ లా వెళ్ళాడు కానీ అక్కడ ఇబ్బంది పడుతున్న ప్రజల బాధలు విన్న పాపాన పోలేదు.

రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణలోని గొలుసుకట్టు చెరువులను మళ్ళీ పునరుద్ధరించాలని రాష్ట్రం ఏర్పడకముందే ప్రణాళికలు రచించి తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడ్డాక మిషన్ కాకతీయ పెరుతో చేరువులను పటిష్టము చేసిన ఘనత కేసీఆర్‌ది అని అందుకే భారీవర్షాలు కురిసిన చెరువులు తట్టుకున్నాయి అన్నారు. మిషన్ కాకతీయ చేపట్టకపోతే చేరువులన్ని తెగిపోయేవి. ఈ విషయం తెలంగాణలో ఏ రైతునైన అడిగితే తెలుస్తుంది.

వరదల్లో చనిపోయిన వారికి ఇరవై ఐదు లక్షలు..నష్టపోయిన పంట నష్టంకు ముప్పై వేలు ఇస్తామని గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉంటూ చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అధికారం లోకి వచ్చాక ఎకరానికి పదివేలు, చనిపోయిన ఒక్కొక్కర్కి ఐదు లక్షలిస్తామంటున్నారు.. ఇప్పటి కైనా వరద సాయం పెంచి చనిపోయిన వారికి 25 లక్షలు,పంట నష్టం కు ఎకరాకు 30 వేలు ఇచ్చి వరద బాధితులను ఆదుకోవాలి అని డిమాండ్ చేస్తున్న

# శివారు ప్రాంతాలకు సైతం ఆహార పదార్థాలు

(మొదటిపేజీ తరువాయి..)

సహాయ సహకారాలు అందిస్తున్నాం.

– 179 సచివాలయాల్లో ఒక్కో సచివాలయానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాం.

– వరద బాధితులకు అందించే ఆహారాన్ని ట్రాక్టర్లో గానీ వాహనాల్లో గానీ తీసుకెళ్లి అందిస్తున్నాం.

– చుట్టుపక్కల ఉన్న జిల్లాల నుంచి సైతం ఆహార పదార్థాలను తీసుకొచ్చి ప్రజలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనం మూడు పూటలా అందే విధంగా చూస్తున్నాం.

– లాస్ట్ మైలులో చిట్టచివరి వ్యక్తికీ ఆహారం చేరాలని ఆదేశాలు ఇచ్చాం.– అధికారులందరూ సమన్వయంతో మీకు కేటాయించిన ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలబడి మానవతా దృక్పథంతో వాళ్లకి సహాయ సహకారాలు అందించాలి.

– చిట్టచివరి వ్యక్తికీ సహాయం అందించేందుకు వీలుగా టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నాం.

– ఆహార పదార్థాలు ఎక్కడా వృథా కాకుండా ఎక్కడపడితే అక్కడ కాకుండా ఆయా సచివాలయాల పరిధిలో సరైన విధంగా బాధితులకు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇందుకు సంబంధించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం.

– వరద ప్రభావంతో ప్రజలు పడే బాధ వర్ణనాతీతం. పాములు, తేళ్లు కూడా ఇళ్లలోకి వస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఉన్నవారికి నిబద్ధతతో సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

– ఐ వి ఆర్ ఎస్ ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకొని ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా... సరైన సమాచారం మాత్రమే అందించాలి.

– అధికారులు ఎవరికి కేటాయించిన ప్రాంతాల్లో వారు సమన్వయం చేసుకుంటూ సర్వశక్తులు ఒడ్డి పనిచేయాల్సిన అవసరం ఉంది.

– పారిశుద్ధ్యంపైనా ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నాం.

– ప్రజల కూడా సంయమనం పాటించి సహకరించాలి.

– ఇబ్బందుల్లో, బాధల్లో ఉన్న వారికి అండగా నిలవాల్సిన సమయమిది.

– ఫిర్యాదులు, విజ్ఞప్తుల కోసం మూడో నెంబర్ ను కూడా అందుబాటులోకి తెస్తాం.

– జక్కంపూడిలో తన విధులు సక్రమంగా నిర్వర్తించని ఉద్యోగిని సస్పెండ్ చేశాం.

– ఎవరైనా తమ విధులు సక్రమంగా నిర్వహించకపోతే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదు. తప్పనిసరిగా యాక్షన్ తీసుకుంటాం.

– ప్రకాశం బ్యారేజీకి వచ్చిన బోట్లు ఎక్కడినుంచి వచ్చాయో ఎంక్వయిరీ చేస్తాం. పరిస్థితిని చూస్తుంటే ఎన్నో అనుమానాలు వస్తున్నాయి.

– బాధితులకు సేవలు అందించే విషయంలో ప్రతి ఒక్కరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ప్రజాహితం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని మరోసారి పిలుపునిస్తున్నా.

# ఇదో రాక్షసానందలహరి!

- అమరావతిపై సోషల్‌మీడియా 'సైకో'పాఖ్యానం

(నల్లమోతు శ్రీధర్)





"విజయవాడ మునిగిపోయింది.. ఇదేం రాజధాని.." అనే ట్రోలింగ్స్ చూస్తున్నాం. తోటి మనిషి కష్టాల్లో ఉంటే ఎగతాళి చేసే వాళ్లని ఏమంటారో తెలుసా.. రాక్షసులు అంటారు. వాళ్ల స్వభావాన్ని రాక్షసత్వం అంటారు.

అవును గతంలో వైజాగూ మునిగిపోయింది.. అంతకు ముందు హైదరాబాదూ మునిగిపోయింది 2001లో.. నిన్న మొన్న కూడా! మరి హైదరాబాద్ ఏం రాజధాని? చెన్నై మునిగిపోలేదా.. ముంబై మునిగిపోలేదా? 30 సెంటీమీటర్ల వర్షపాతాన్ని తట్టుకునే ఏ నగరం ఉందో దేశంలో చూపించండి.

ప్రపంచవ్యాప్తంగా పెద్ద పెద్ద నగరాలే ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు కొట్టుకుపోతుంటాయి.. తెలీదేమో.. ఇసుక తుఫాన్లు, మంచు తుఫాన్లు, వరదలు, సునామీలూ ప్రపంచానికి కొత్తేం కాదు. దీంట్లో కూడా ఎగతాళి చేసే స్వభావం కలిగిన మన తెలుగు యువతని చూస్తే జాలేస్తోంది.

మౌలిక సదుపాయాలు లేవు అంటారు. మళ్లీ ఎలక్షన్లు వస్తే మా ఇంట్లో ఒక్కొకరికి ఐదు వేలు ఇవ్వలేదని బజారుకెక్కుతారు. మాకు పథకాలు కావాలంటారు.. మేము సోమరిపోతుల్లా కూర్చుని తింటాం.. ఏ పనీ చెయ్యకుండా బేవార్స్ బ్యాచ్‌లా ఊరేగుతాం.. ప్రభుత్వాలు మమ్మల్ని చూసుకోవాలి అని మన బద్ధకాన్ని ప్రభుత్వాల బాధ్యతగా నెట్టేస్తాం. వర్షాలూ, వరదలు వచ్చినప్పుడు రాత్రింబవళ్లు రంగంలోకి దిగి అన్నీ చక్కదిద్దే నాయకులు ఉన్నారు, అందుకు సంతోషించండి.. వారు కూడా హెలికాప్టర్లలో తిరుగుతూ ఏరియల్ సర్వేలు చేయొచ్చు.. కానీ బాధ్యతగా దగ్గరుండి చూస్తున్నారు, సంతోషించండి.

వరదలు వర్షాలు వచ్చినప్పుడు చేతనైనే రంగంలోకి దిగి సాయం అందించండి. లేదంటే కనీసం సోషల్ మీడియాలో ఓ సానుభూతి పోస్ట్ పెట్టండి. అంతే తప్పించి ఎగతాళి చెయ్యకండి. ఈరోజు మనం ఇంకొకరిని ఎగతాళి చేస్తే రేపు ఆ ఎగతాళి మిమ్మల్ని చూసీ చేస్తారు.

# సభ్యత్వ సేకరణ కార్యక్రమం వాయిదా

- కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి

హైదరాబాద్, మహానాడు:

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర స్థాయి సభ్యత్వ సేకరణ కార్యక్రమం ఈరోజు సెప్టెంబరు 3 ప్రారంభించాలని ముందుగా నిర్ణయించినా, భారీ వర్షాల దృష్ట్యా కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో బిజెపి కార్యకర్తలందరూ బాధితులకు సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.వరద ముంపు ప్రాంతాల ప్రజలు తేరుకున్నాక త్వరలోనే కొత్త తేదీని ప్రకటించి, తెలంగాణలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.

తెలంగాణ రాష్ట్రంలో గత 4 రోజుల నుంచి భారీ వర్షాల కారణంగా ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలతో పాటు దాదాపు 11 జిల్లాల్లో వరదలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదల కారణంగా పలు ప్రాంతాల్లో ప్రాణనష్టం జరగడం దురదృష్టకరం.

చాలా ప్రాంతాల్లో ప్రజలు ఇండ్లు, ఆస్తులు కోల్పోయారు. మరికొన్ని చోట్ల రోడ్లు, రైల్వే లైన్లు దెబ్బతిన్నాయి.తెలంగాణలో భారీ వర్షాలు, వరద పరిస్థితిపై మేం ఎప్పటికప్పుడు సమీక్షించి, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లాం.

స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి వివరాలు తెలుసుకుని, అవసరమైన విధంగా రాష్ట్రానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించారు. సహాయ సహకారాలు అందించారు.

వరంగల్, మహబూబాబాద్ తో పాటు ఇతర ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు, రైల్వే ట్రాక్ లను వెంటనే మరమ్మతులు చేసి, ప్రయాణికులు రాకపోకలు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

అదేవిధంగా బిజెపి శ్రేణులు ఎక్కడ కూడా రాజకీయాలకు తావులేకుండా సేవాభావంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో భాగస్వామ్యమయ్యారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇప్పటికీ చాలా గ్రామాల్లో వరదతో నిండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో సహాయం విషయంలో కేంద్రప్రభుత్వం కృషి చేస్తోంది.

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఇప్పటికే స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్స్ ఉన్నాయి. ఆ నిధులతో బాధితులకు సహాయ కార్యక్రమాలు చేపట్టాలి.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు నేటి కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో కేంద్రం విడుదల చేసిన స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్స్ కు సంబంధించి యుటిలైజేషన్ సర్టిఫికెట్స్ ను కేంద్రానికి సమర్పించలేదు.గతంలో కేంద్ర ప్రభుత్వం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్స్ నిధులు విడుదల చేసినా, రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో రాష్ట్రంలో బాధితులకు అందలేదు.

అయితే, మొన్నటి వర్షాలతో బాధితులు ఇబ్బందులు పడుతున్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వం యుటిలైజేషన్ సర్టిఫికెట్స్ ఇవ్వకున్నా తాత్కాలికంగా వరద బాధిత ప్రాంతాలకు తక్షణమే సాయం అందించాలని కేంద్ర హోం సెక్రటరీని కోరాం.

ఇప్పటికే జూన్ 1వ తేదీన కేంద్రం రూ. 208 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ (AG) ఇచ్చిన వివరాల ప్రకారం తెలంగాణ SDRF%అకౌంట్‌లో రూ.1,345.15 కోట్లు ఉన్నాయి. వరదల కారణంగా మరణించిన మృతుల కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రక టించింది.

క్షతగాత్రులకు 60% పైబడిన వైకల్యానికి రూ.2.5 లక్షలు, ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి, వారానికన్నా ఎక్కువ రోజు ఆసుపత్రిలో ఉంటే రూ. 16వేలు, వారం కన్నా తక్కువ రోజులుంటే రూ.5,400 చొప్పున అందిస్తుంది.



వరదల కారణంగా వస్తువులు నష్టపోయిన వారికి. దుస్తులు నష్టపోయిన వారికి రూ.2,500, వంటపాత్రలు నష్టపోయిన వారికి రూ.2,500, పాడి పశువులను కోల్పోయిన రైతులకు గేదె, ఆవులకు అయితే ఒక్కో దానికి రూ. 37,500, గొర్రె, మేకలకు అయితే.. ఒక్కోదానికి రూ.4వేలు, ఒక్కో ఎద్దుకు రూ. 32వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది.

వరదల కారణంగా జీవనోపాధి కోల్పోయిన వారికి, ఉపాధిహామీ పథకం ప్రకారం రోజుకు ఇవ్వాల్సిన కూలీ అందిస్తుంది. బాధితులను లెక్కించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే.

వరదల కారణంగా జీవనోపాధి కోల్పోయిన వారికి 2 హెక్టార్ల (5 ఎకరాలు) వరకు భూమి ఉన్న చిన్న , సన్నకారు రైతులకు సహాయం అందించడం జరుగుతంది. పంట పొలాల్లో కూరుకుపోయిన మట్టిని తొలగించేందుకు హెక్టారుకు (2.5 ఎకరాలు) రూ.18వేలు, ఒక రైతుకు కనీసం రూ.2,200 చొప్పున సహాయం అందిస్తుంది.

పంటలకు వర్షాధార ప్రాంతాల్లో హెక్టారుకు రూ.8,500, నీటిపారుదల అందుబాటులో ఉన్నపంటలకు హెక్టారుకు రూ.17వేలు, పామాయిల్, కొబ్బరి వంటి శాశ్వత పంటలకు,హెక్టారుకు రూ.22,500 అందిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం కూడా వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి కేంద్ర ప్రభుత్వం నుంచి అందించే ఆర్థిక సాయాన్ని బాధితులకు అందజేయాలని కోరుతున్నాం. గతంలోనూ విడుదల చేసిన నిధులకు యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించి, అదనంగా ఎస్డీఆర్ఎఫ్ నిధులను పొందాలని కోరుతున్నాను.

రాష్ట్ర ప్రభుత్వం వరద ప్రభావిత ప్రాంతాల్లో అంటు వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలి.అందుకు అవసరమైన మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, డాక్టర్లను కేటాయించాలి.అదేవిధంగా ప్రజలకు జరిగిన నష్టాన్ని పూడ్చేలా సహాయసహకారాలు అందించాలి.రాష్ట్ర ప్రభుత్వం వరదలతో జరిగిన నష్టాన్ని అంచనా వేసి నిధులు సమకూర్చాలి.

ఇంతవరకు అధికార పార్టీకి చెందిన నాయకులు చాలావరకు తమ వద్దకు రాలేదంటూ వరద బాధితుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. సెప్టెంబరు 17 న

తెలంగాణ గడ్డపై నిరంకుశ నిజాం సైన్యాన్ని ఓడించి, భారత త్రివర్ణ పతాకం ఎగిరిన రోజు.

గత రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా హైదరాబాద్ ముక్త్ దివస్‌ను జరుపుకుంటున్నాం. అదేవిధంగా ఈ ఏడాది కూడా సెప్టెంబరు 17న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించాలని ఆదేశించింది. ఇప్పటికే కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు హైదరాబాద్ ముక్తి దివస్ పేరుతో అధికారిక కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి. దురదృష్టవశాత్తు తెలంగాణ రాష్ట్రంలో మజ్లిస్ పార్టీకి భయపడి గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహించలేదు. అందుకే, కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని సెప్టెంబరు 17న అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడులకను జరుపుతోంది.సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఉ.9 గం.లకు హైదరాబాద్ ముక్త్ దివస్ ఉత్సవాలను నిర్వహిస్తాం. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం లోని ప్రతి గ్రామ పంచాయతీ భవనంపై, ప్రభుత్వ పాఠశాలలపై త్రివర్ణ పతాకం ఎగురవేసి వేడుకలను ఘనంగా జరుపుతాం.

## షోరూంలో నీట మునిగిన కార్లు



విజయవాడ,మహానాడు: విజయవాడలో కురిసిన భారీ వర్షాలకు కార్ల షోరూం నిర్వహకులు భారీగా నష్టపోయారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న దాదాపు 300 కొత్త, పాత కార్లు నీటితో నిండిపోయాయి. రూరల్ మండలం ముస్తాబాద్ గ్రామంలో కార్ల షోరూం బుడమేరు వరద ముంపుకి గురైంది.దీంతో అందులోని కార్లన్నీ నీటిలో మునిగి కనిపిస్తున్నాయి. దీంతో భారీగా నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. షోరూం వద్ద ఉన్న పార్కింగ్ గౌడౌన్లో పార్క్ చేసిన చిన్న కార్ల నుంచి లగ్జరీ మోడళ్ల వరకూ మునకలో ఉండటంతో నష్టం వాటిల్లిందని షోరూం నిర్వాహకులు తెలిపారు.




వరదల్లో చిక్కుకున్న తుళ్ళూరు మండలం పెదలంక గ్రామస్తులు 21 మందిని హెలికాప్టర్ ద్వారా ఇబ్రహీంపట్నంలోని పునరావాస సహాయక కేంద్రానికి తరలించిన వరద సహాయక బృందాలు.

6

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 04, సెప్టెంబర్ 2024




## ఆహార పొట్లాలు పంపిణీ చేసిన మంత్రి సవిత

విజయవాడ, మహానాడు:

విజయవాడ 55 డివిజన్ లో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మంగళవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్ళి ఆహార పొట్లాలు, పాలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. వరద బాధితులను చంద్రబాబు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. వరద తగ్గే వరకు సమీప పునరావాస కేంద్రాలకు తరలి వెళ్ళాలని మంత్రి కోరారు.

## నెల్లూరు ఎంపీ రూ.కోటి విరాళం

నెల్లూరు, మహానాడు: వరద బాధితులకు తెలుగుదేశం పార్టీ(టీడీపీ) నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రూ.కోటి సాయం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును తన భార్య, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితో కలిసి



ఆయన సీఎం చంద్రబాబుకు అందజేశారు. కాగా వరద బాధితులకు స్వచ్ఛందంగా ఆహారం ఇవ్వాలనుకునేవారి కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం ఐఏఎస్ అధికారి మనీ జీర్(79067 96105)ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించింది.

### 10 వేల మంది కార్మికులతో

## పారిశుధ్యం నిర్వహణ

◆ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ



విజయవాడ, మహానాడు:

ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం సాధారణ స్థితికి తీసుకురావడానికి 10 వేల మంది కార్మికులు అవసరమని, నీరు తగ్గిన తర్వాత రోడ్లపై మురుగు లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన వరద ప్రభావిత ప్రాంతాల్లో నీరు తగ్గిన తర్వాత చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులపై మంగళవారం సమావేశం నిర్వహిం చారు. మంత్రి ఏమన్నా రంటే.. వరద ముంపు ప్రాంతాల్లో ఎంతో కష్టపడి బాధితులను బయటికి తీసుకొచ్చాం.. దాదాపు బాధితులందరికీ ఆహారం అందేలా ఏర్పాట్లు చేశాం. ఇవాళ 8.5 లక్షల ఫుడ్ ప్యాకెట్లు టిఫిన్ కోసం, మరో 8.5 లక్షల అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశాం. 5 లక్షల వాటర్ బాటిల్స్ పంపిణీ చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీల కమిషనర్లకు వరద ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాం. ఒక్కో సచివాలయానికి ఒక్కో ప్రత్యేకాధికారి ఉంటారు. వరద నీరు తగ్గగానే ఫైర్ డిపార్ట్మెంట్ తో కలిసి ట్యాంకర్ల తో రోడ్లు శుభ్రం చేస్తాం. బ్లీచింగ్, ఫాగింగ్ పనులు వెంటనే చేపడతాం. వైద్యారోగ్య శాఖతో కలిసి మెడికల్ క్యాంపులు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.



విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో వరద బాధితులకు ఆహార పంపిణీ కోసం ఏర్పాటు చేసిన డ్రోన్లను మంగళవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ పరిశీలించారు.

## నేడు జన్మదిన వేడుకలు జరుపుకోవడం లేదు

- ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

అమరావతి, మహానాడు:

కృష్ణా నది వరదల విపత్తు నేపథ్యంలో బుధవారం నా జన్మదిన వేడుకలు జరుపుకోవడం లేదని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. కృష్ణా నది వరదల కారణంగా ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అపార నష్టం జరిగిందన్నారు. దీంతో యావత్తాంధ్రప్రదేశ్ తీవ్ర విషాదంలో కూరుకుపోయిం దన్నారు. ఇటువంటి దుఃఖ సమయంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం సబబుకాదని, అందుకే రేపటి వేడుకలకు దూరంగా ఉంటు న్నానని స్పీకర్ పేర్కొ న్నారు. జన్మదిన శుభాకాంక్షలు తెలపడానికి అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తనను కలవొద్దని కోరారు.



తీవ్ర దుఃఖంలో ఉన్న వరద బాధితులకు సాయం చేయాలని స్పీకర్ ఆ ప్రకటనలో కోరారు.

## ఆహారం అందుతుందా.. లేదా?

◆ వరద బాధితులను అడిగితెలుసుకున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, మహానాడు:

ఆహారం అందుతుందా... లేదా? అని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరద బాధితులను అడిగి తెలుసుకున్నారు. కాన్వాయ్, ఇతర



వాహనాలు వెళ్ళలేని పరిస్థితుల్లో జేసీబీ ఎక్కి వరద కాలనీల్లో సీఎం పర్యటించారు. దాదాపు నాలుగు గంటలు ఏకధాటిగా పర్యటించారు. మధ్యాహ్న భోజనం కూడా చేయకుండా బాధితుల కష్టాలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా చర్యలు ఉంటాయని చెబుతూ.. కాలనీల చివర్లో ఉన్న ఇళ్లకు ఆహారం అందడం లేదన్న అంశంపై సీఎం ఆరా తీశారు.

## భారీగా ఆహార పొట్లాలు సిద్ధం

◆ మంత్రి నారాయణ

విజయవాడ, మహానాడు:

వరద ముంపు ప్రాంతాల బాధితులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం భారీగా ఆహారం పొట్లాలు సిద్ధం చేసిందని, ఇతర జిల్లాల నుంచి ఇందిరా గాంధీ స్టేడియంకు లారీల్లో ఫుడ్ ప్యాకెట్లు, ఫ్రూట్‌లు, వాటర్ ప్యాకెట్లు చేరుకుంటు న్నాయని మంత్రి నారాయణ తెలిపారు. ఇంకా.. ఆయన ఏమన్నారంటే.. సీఎం చంద్రబాబు ఆదేశాలతో వరద బాధితులకు పెద్ద ఎత్తున ఆహారం పంపిణీ చేస్తున్నాం.ఇప్పటికే 2లక్షల ప్యాకెట్ల ఆహారం ఉదయం టిఫిన్ కోసం పంపించాం. 3 లక్షల వాటర్ బాటిల్స్ కూడా బాధితులకు పంపిణీ కోసం పంపించాం. గుంటూరు, ఒంగోలు, ఏలూరు, భీమవరం, రాజహేంద్రవరం మున్సిపాలిటీల తో పాటు హరే కృష్ణ మూవ్ మెంట్, పలు కంపెనీలకు ఆహారం తయారీ బాధ్యతలు అప్పగించాం. మొత్తం 6 లక్షల ఫుడ్ ప్యాకెట్లు, 6 లక్షల వాటర్ బాటిళ్ళు పంపిణీ చేస్తున్నాం. ఆహారం తో పాటు అరటిపండ్లు, ఇతర ఫ్రూట్స్ పంపించాం. వరద బాధితులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రభుత్వ యంత్రాంగం అంతా విజయవాడలోనే ఉండి అన్ని ఏర్పాట్లు చూస్తోంది.










ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విజయవాడ 15 డివిజన్‌లో సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు కన్నా లక్ష్మి నారాయణ మంగళవారం పర్యటించారు. పునరావాస కేంద్రాల వద్దకు వెళ్లి ఆహార పొట్లాలు, పాలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. వరద బాధితులను చంద్రబాబు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.



విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లురవీంద్ర, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో విజయవాడ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న వరద సహాయ కార్యక్రమాలపై చర్చిస్తున్న పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్.

## చివరి బాధితుడికీ సాయం అందిస్తాం

◆ ఎమ్మెల్యే అరవింద బాబు

విజయవాడ, మహానాడు:

చరిత్ర ఎరుగని విపత్తుతో నీట మునిగిన విజయవాడ నగరాన్ని పూర్వ స్థితికి తీసుకొచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. ఈ మేరకు విజయవాడ నగరంలోని 40వ డివిజన్ భవానీపురం బస్టాండ్, బాల భాస్కర్ నగర్లో పర్యటించారు. వరద



బాధితులకు భరోసా కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో కాలువలను శుభ్రం చేయకపోవడం, సిల్టు తొలగించకపోవడం, పూడిక తొలగించకపోవడంతోనే వరద ముప్పు తలెత్తిందన్నారు. ఎంతటి విపత్తునైనా ఎదుర్కొనేంత సమర్ధవంతమైన నాయకత్వం ఈ ప్రభుత్వానికి ఉందన్నారు.

వరద బాధితుల కోసం ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్ రూ. 5 లక్షలు, మంగళగిరి నియోజక వర్గానికి చెందిన పి.లక్ష్మీ వెంకటనారాయణ మూర్తి యాదవ్ దంపతులు రూ. 1.2 లక్షల విరాళాన్ని మంత్రి లోకేష్‌కు అందజేశారు.





గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలో ఉద్దండిరాయని పాలెం లోని పునరావాస కేంద్రంలో భోజనాలు చేస్తున్న వరద బాధితులు.

వరద నీటిలో మునిగిన కొల్లిపర మండలంలో బొమ్మవానిపాలెం గ్రామంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ నాటు పడవలో ప్రయాణిస్తూ గ్రామస్తులను పునరావాస కేంద్రాలకు రావాలని విజ్ఞప్తి చేశారు.





జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 04, సెప్టెంబర్ 2024



వరద బాధితుల సహాయక చర్యల కోసం ఏపీ,తెలంగాణ ప్రభుత్వాల ముఖ్యమంత్రి సహాయ నిధికి చెరొక రూ 2.5 లక్షల విరాళం ప్రకటించిన సినీ నటి అనన్య నాగళ్ల.



కాంగ్రెస్ గుండాల దాడిలో తీవ్రంగా గాయపడిన సురారం సంతోష్ రెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుతో కలసి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు..



నాగర్ కర్నూల్ జిల్లాలో డిండి ప్రాజెక్ట్ వరదతో గోనబోయనపల్లి శివారులో రాతిబండపై ఉంటున్న చిన్నపిల్లలతో సహా 10 మంది చెంచులు ఆ వరద మధ్యలో చిక్కుకుపోయారు. వెంటనే నాగర్ కర్నూల్, నల్గొండ జిల్లా పోలీసులు రెస్క్యూ మిషన్ నిర్వహించి వారిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు.



కోటి రూపాయలు.... వరద బాధితుల సహాయార్థం ప్రకటించిన వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి.



విజయవాడ ముంపు ప్రాంతాల్లో పర్యటించి, భోజనం, త్రాగునీరు, పాలు ముంపు బాధితులకు అందిస్తున్న రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రాఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్

## అమరావతిపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

◆ మంత్రి నిమ్మల



**అమరావతి,మహానాడు:** గత 5 ఐదేళ్లలో వైసీపీ పాలకుల తప్పులు, పాపాలకు మనం బాదితుల మయ్యామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అమరావతిపై దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని చెప్పారు. అమరావతిపై విషం చిమ్మడం వైసీపీకి మొదట్నుంచీ అలవాటేనని విమర్శలు చేశారు.రాజధాని అమరావతికి ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేశారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారానికి వైసీపీ కుయుక్తులు పన్నుతోందని ఆరోపణలు చేశారు. అమరావతి ముంపు ప్రాంతమనే జగన్ దుష్ప్రచారానికి కొందరు యత్నం చేస్తున్నారని విమర్శలు చేశారు.

కొన్ని పేటీఎం బృందాలు, పెయిడ్ ఛానళ్లు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. 11.5 లక్షల క్యూసెక్కులు పోటెత్తినా అమరావతి చెక్కుచెదర లేదని అన్నారు. ప్రకాశం బ్యారేజీకి 4 బోట్లు కొట్టుకురావడం వెనుక వైసీపీ కుట్ర ఉండొచ్చని అన్నారు. వైసీపీ నేతలు దుర్మార్గం చేయగల ఘనులేనని మంత్రి పేర్కొన్నారు.

## మృతుల కుటుంబాలకు రూ.3 లక్షల పరిహారం

◆ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మహానాడు:** తెలుగు రాష్ట్రాల్లో వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు ప్రధాని మోదీ, కేంద్ర




హోంమంత్రి అమిత్ షా సమీక్ష చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు చేయాలని పీఎంవో ఆదేశించినట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు కేంద్రం రూ.3 లక్షల పరిహారం ఇస్తుందన్నారు. జాతీయ విపత్తుగా ఎక్కడా ప్రకటించడం లేదని, అవసరమైతే ప్రధాని రాష్ట్రంలో పర్యటిస్తారని చెప్పారు.

## ఇదేం ద్వంద్వ వైఖరి రాహుల్ గాంధీ గారు?

◆ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మహానాడు:** ప్రభుత్వాలు చేస్తున్న "బుల్డోజర్ పాలిటిక్స్" ప్రజల జీవితాలపై దాడి అంటూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాను. ఇదే సందర్భంలో



సుప్రీం వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ తీరు చూస్తుంటే మాత్రం ఆశ్చర్యం వేస్తోంది. ఓ వైపు బుల్డోజర్ న్యాయం రాజ్యాంగ విరుద్ధమంటూ ఆయన పెద్ద పెద్ద మాటలు చెబుతుంటారు. అదే తెలంగాణలో తమ పార్టీ పాలనలో బుల్డోజర్ తో జరుగుతున్న విధ్వంసం పై మాత్రం మౌనంగా ఉంటారు. ఇదేం ద్వంద్వ వైఖరి రాహుల్ గాంధీ గారు?

తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి బుల్డోజర్‌తో అన్యాయాలను కొనసాగిస్తుంటే ఆయనను ఆపలేని శక్తి హీనులుగా మారారా? లేదంటే ప్రజలను మోసం చేసే మీకు అలవాటైనా డబుల్ స్టాండర్ట్స్ విధానాలను ఇలా కొనసాగిస్తున్నారా? మీ ద్వంద్వ వైఖరిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు.

## పెట్రోల్ అక్కర్లేదు!

◆ మార్కెట్లోకి బజాజ్ కొత్త బైక్



బజాజ్ కంపెనీ ఇటీవలే మొట్టమొదటిసారి సీఎన్జీతో నడిచే బైక్ ను విడుదల చేసి, ప్రపంచాన్ని ఆశ్చర్యపర్చింది. అయితే, ఇప్పుడు ఆ కంపెనీ మరో అడుగు ముందుకేసి ఇథనాల్ తో నడిచే ఈ ద్విచక్ర వాహనాన్ని విడుదల చేయబోతోంది. ఈ బైక్లో 100 సీసీ ఇంజన్ ఉంటుంది. వచ్చే ఏడాది మార్కెట్లోకి రానుందంటున్నారు.

## 5, 6 తేదీల్లో మరో అల్పపీడనం

**విజయవాడ, మహానాడు:** మరో గండం పొంచివుంది. ఈనెల 5, 6 తేదీల్లో బంగాళాఖాతంలోని ఉత్తర అండమాన్ ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. ఇది తుపానుగా మారి.. విశాఖపట్నం, ఒడిశా దిశగా ప్రయాణించి తీరం దాటే అవకాశం ఉన్నట్టు అంచనా




వేస్తున్నారు. మంగళ, బుధవారాల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కాగా, వాయుగుండం ప్రభావం నుంచి ఇంకా పూర్తిగా తేరుకోకముందే మరో అల్పపీడనం ఏర్పడనుందనే సమాచారం ముంపు ప్రాంతాల ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది.

## సింగ్ నగర్‌లో మృతదేహం!

**విజయవాడ, మహానాడు:** నగరంలోని సింగ్ నగర్ పైపుల్ రోడ్డు పక్క సందులో ఏ వన్ టీ స్టాల్ వద్ద మృతదేహం పడివుంది. మూడు రోజులుగా మృతదేహం నుండి దుర్వాసన రావడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతుడి వయసు సుమారు 50 సంవత్సరాలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.




అనారోగ్య కారణాలవల్ల మృతి చెంది ఉండొచ్చని, అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదని స్థానికికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సాధారణ పరిస్థితులు వచ్చే వరకూ ప్రభుత్వం అండ

◆ హోం మంత్రి వంగలపూడి అనిత

**విజయవాడ, మహానాడు:** సాధారణ పరిస్థితులు వచ్చే వరకూ వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఆకలి, దప్పులు లేకుండా అందరినీ ఆదుకుంటామని, చంద్రబాబు ముందు



చూపు, అనుభవంతో ప్రాణ నష్టం నివారించగలిగామని ఆమె అన్నారు. మంగళవారం ఉదయం నుంచే భవనీపురం లలితానగర్ ప్రాంతంలో ముంపు ప్రాంతంలోని ప్రజలకు ఆహార పొట్లాలు, నీరు పంపిణీ చేశారు. మోకాళ్లలోతు పైన ఇంకా నీరు నిలిచి ఉండడంతో ట్రాక్టర్ పైన ప్రయాణం చేస్తూ ఆ కాలనీ వాసులకు ఆహారం పంపిణీ చేశారు.

చిన్నారులు, మహి ళలు, ప్రత్యేక ఇబ్బందికర పరిస్థితులున్న వారి వివరాలు అడిగి తెలుసు కున్నారు. నీరు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా ఆహారం అందించడంపైన ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. ఆమెతో పాటు గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 04, సెప్టెంబర్ 2024

# వైఎస్ వర్ధంతికి 'ధర్మాన' దూరం



**శ్రీకాకుళం, మహానాడు:**

శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలిలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు దూరంగా ఉన్నారు. దీంతో పార్టీ శ్రేణుల్లో చర్చ మొదలైంది. ఈ ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారం కోల్పోయిన అనంతరం శ్రీకాకుళం నియోజక వర్గంలో ధర్మాన ప్రసాదరావు క్యాడర్‌కు దూరంగా ఉండడంపై కొందరు కృష్ణదాస్ వద్ద ప్రస్తావించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సైతం మంత్రి పదవిరాకపోవడంతో బంగ్లాకే పరిమితమయ్యారని విమర్శలు ఉన్న విషయం విదితమే. శాసనసభ ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా బంగ్లా దాటి బయటకు రావడంలేదని కొందరు కార్యకర్తలు చెబుతున్నారు. అయితే ధర్మాన ప్రసాదరావు పార్టీపై విముఖతతో ఉన్నారని, అందుకే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని కొందరంటున్నారు.

# గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ యాజమాన్యానికి నోటీసులు

◆ **ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి**



**గుడ్లవల్లేరు, మహానాడు:**

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ లేడీస్ హాస్టల్ వాష్ రూమ్ లలో హిడెన్ కెమెరాల ఘటనను మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుందని ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకట లక్ష్మి మంగళవారం తెలిపారు. ఇంకా ఆమె ఏమన్నారంటే.. హాస్టల్ విద్యార్థినులతో సంభాషించి, హాస్టల్ వాష్ రూమ్స్ పరిశీలించాం. సిబ్బంది నిర్లక్ష్యం అడుగడుగునా కనిపించింది. విద్యార్థులు అనుమానాలు వ్యక్తపరుస్తూ న్యాయం చేయవలసిందిగా కోరారు. కాలేజీ యాజమాన్యం, హాస్టల్ సిబ్బందికి మహిళా కమిషన్ ముందు ఈ నెల పదోతేదీన ఉదయం 11 గంటలకు హాజరై వివరణ ఇవ్వవలసిందిగా నోటీసులు జారీ చేశాం. వారి వివరణ ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం.

# పెదమద్దూరు బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తా...

◆ **ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్**



**అమరావతి, మహానాడు:**

అమరావతి మండలం, పెదమద్దూరులోని ముంపు ప్రాంతాల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మంగళవారం పర్యటించారు. వరదలతో ఇబ్బందులు పడుతున్న బాధితులను ఎమ్మెల్యే పరామర్శించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదలు తగ్గుముఖం పట్టడం ఊరటనిస్తుందన్నారు. 2014 టీడీపీ ప్రభుత్వం అధికారంలో రాజధానిని కలుపుతూ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడితే వైసీపీ ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేసిందన్నారు. దీని కారణంగానే పెదమద్దూరు గ్రామం ముంపునకు గురైందన్నారు. భవిష్యత్తులో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి గ్రామాన్ని రక్షించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# బాధితులకు ఎలాంటి సమస్య రానీయొద్దు

◆ **సాయంపై మంత్రి నారాయణ దిశానిర్దేశం**



**విజయవాడ, మహానాడు:**

వరద సహాయక చర్యలపై అన్ని శాఖలను సమన్వయం చేస్తూ మంత్రి నారాయణ దిశానిర్దేశం చేస్తున్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఉదయం నుంచి మంత్రులు, అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఆహారం, మంచినీరు పంపిణీపై ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇచ్చారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీఎంవో, వైద్యారోగ్య, హోం శాఖల అధికారులతో వరుసగా సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేశారు. క్షేత్ర స్థాయిలో అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలిస్తూ వరద బాధితులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని మంత్రి ఆదేశాలు ఇచ్చారు.

# శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

◆ **కమిషనర్ పులి శ్రీనివాసులు**



**గుంటూరు, మహానాడు:**

నగర శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ప్రధానంగా విలీన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక బుడంపాడులోని పలు ప్రాంతాలను, రిజర్వాయర్ ని పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బుడంపాడు చెరువు వైపు నివాసాలకు వెళ్లే రోడ్ వర్షాలకు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్న స్థానికుల అభ్యర్థన మేరకు తక్షణం ప్యాచ్ వర్క్ చేపట్టాలని, అవసరం ఉన్న ప్రాంతంలో కల్వర్ట్ నిర్మాణంకు అంచనాలు వేసి తమకు పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్‌లో మోటర్లు సరిగా పనిచేయకపోవడం వలన పూర్తి స్థాయిలో సరఫరా సాధ్యం కావడం లేదని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

## 74 ఏళ్ళ వయసులోనూ

# చంద్రబాబు నవ యువకుడే...

◆ **ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజు**



**ఉండి, మహానాడు:**

మానవమాత్రుడు ఎవరైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కంటే చురుకుగా పని చేయలేరని ఉండి శాసనసభ్యుడు రఘురామకృష్ణంరాజు అన్నారు. 74 ఏళ్ల వయసులోనూ ఆయన ఇంకా నవ యువకుడేనని పేర్కొన్నారు. మూడు రోజులుగా విజయవాడ గజ గజ అన్న వార్తలనే వింటున్నాం. గత 50 సంవత్సరాల క్రితం ఎప్పుడో ఇంత వర్షం వచ్చిందట. మళ్లీ ఇప్పుడు అంత బీభత్సంగా వర్షం వచ్చిందన్నారు. మంగళవారం ఉండి నియోజకవర్గ కేంద్రంలో రఘురామకృష్ణంరాజు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంతలా తిరిగేయటం అవసరమా? అని చాలామంది మాట్లాడొచ్చు. ఆయనకు ఆ అవసరం లేకపోయినప్పటికీ, ప్రజలకు భరోసా ఇవ్వడానికి తిరుగుతున్నారన్నారు. భయమనేది మనిషిని చంపేస్తుందని, భయంతో అల్లాడిపోతున్న వారికి అభయమిచ్చి, నేనున్నానని భరోసా కల్పించడానికి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు సానుకూల సంకేతాన్ని ఇవ్వడానికి ప్రజల్లో చంద్రబాబు నాయుడు తిరగటం ఎంతో అవసరమని రఘురామ కృష్ణంరాజు తెలిపారు.

### బుడమేరుకు లాకులు తీశారనడం హాస్యాస్పదం

బుడమేరుకు లాకులు ఎత్తేయడం వల్లే విజయవాడలో ఈ విధ్వంసం జరిగిందని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని రఘురామ కృష్ణంరాజు విమర్శించారు.

చంద్రబాబు నాయుడు తన ఇల్లు మునిగి పోకుండా ఉండడానికి బుడమేరుకు లాకులు ఎత్తేశారన్న జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. బుడమేరుకు, కృష్ణా నదికి అసలు సంబంధం లేదని రఘురామకృష్ణం రాజు వెల్లడించారు. బుడమేరు ఖమ్మం జిల్లా నుంచి కృష్ణాజిల్లా మైలవరం మీదుగా విజయవాడ అజిత్ సింగ్ నగర్ నుంచి ఉమ్మడి గోదావరి జిల్లాల వెంట కొల్లేరు నుంచి ఉప్పుటేరు ద్వారా సముద్రంలో వెళ్లి కలుస్తుందన్నారు. గేట్లు లేని బుడమేరుకు, గేట్లు ఉంటాయని ఊహించుకొని జగన్మోహన్ రెడ్డి మాట్లాడడం కరెక్ట్ కాదన్నారు.

### అమరావతి రీజన్‌లో నీటి చుక్క నిలవలేదు

అమరావతి క్యాపిటల్ రీజన్‌లో చుక్క నీరు కూడా నిలవలేదని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని కోసం ఎంపిక చేసిన ప్రాంతంలో నీటి చుక్క నిల్వక పోయినప్పటికీ, గ్రాఫిక్స్ లో ఎక్కడో నిలిచిన నీళ్లను తెచ్చి అమరావతి బిల్డింగుల పక్కన ఉన్నట్టుగా మార్ఫింగ్ చేస్తే చేయగలిగింది ఏమీ లేదన్నారు. అమరావతి కోర్ క్యాపిటల్ రీజియన్‌లో నీటి చుక్క లేదన్న ఆయన, అయినా వైకాపా నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

### ఎఫ్‌టిఎల్ ఆక్రమణలను తొలగిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి

తెలంగాణలో చెరువు ఫుల్ ట్యాంక్ లెవెల్‌లో ఆక్రమణలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలగిస్తున్నారని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ఉండి నియోజకవర్గంలో తెలంగాణలో కంటే ముందుగానే కాలువల ఆక్రమణలను తొలగించామని పేర్కొన్నారు. 15 అడుగుల కాలువను అటు మూడు అడుగులు, ఇటు మూడు అడుగులు ఆక్రమించి, వంట కాలువలో డ్రైనేజీ నీరు కలుపుతున్నారని పేర్కొన్నారు.

### నియోజకవర్గ మునగకుండా నేనైతే చూసుకుంటా

ఈనెల 5, 6, 7 వ తేదీలలో మరో వాయుగుండం పొంచి ఉందని, ఈ వాయుగుండం వల్ల ఏలేరు పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలియజేసినట్లుగా రఘురామ కృష్ణంరాజు వెల్లడించారు. భారీ వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఉప్పుటేరు కాలువలలో కిక్కిసా బాగా పేరుకుపోయిందని, దీనివల్ల వరద ప్రవాహం తగ్గుముఖం పట్టే ఛాన్స్ ఉందన్నారు. తాను చొరవ తీసుకొని నాలుగుఖానాల వరకు కిక్కేసాను తొలగించడం వల్ల ప్రస్తుతం ప్రవాహం కొంతమేర ఉధృతంగానే కొనసాగుతుందన్నారు.

### జిల్లాకు ఒక సైబర్ పోలీస్ స్టేషన్

జిల్లాకు ఒక సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేసి, సైబర్ నేరాలను అరికట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. సైబర్ నేరాలు రకరకాలుగా జరుగుతున్నాయని, ఈ నేరాల ద్వారా కేటుగాళ్లు అమాయకులను మోసగిస్తున్నారని చెప్పారు. అర్ధరాత్రి పూట అమ్మాయి పేరిట ఫోన్లో పలకరిస్తూ, అమ్మాయిని చూడగానే సరదా పడే వారిని లోబర్చుకుంటున్నారని తెలిపారు.

### ఐదున కాకపోతే, వారం రోజుల తర్వాత స్కూళ్ల ప్రారంభం

ఉండి నియోజకవర్గంలో అభివృద్ధి చేసిన స్కూళ్లను ఈనెల 5వ తేదీన ప్రారంభించాలని ముందుగా నిర్ణయించినప్పటికీ, అదే రోజు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అవసరమైతే వారం రోజుల తర్వాత ప్రారంభిస్తామని చెప్పారు.





## నీట మునిగిన పంటలను

# పరిశీలించిన హార్టికల్చర్ డైరెక్టర్

**మంగళగిరి, మహానాడు:**

మంగళగిరి మండలం, నూతక్కి, రామచంద్రాపురం గ్రామంలో హార్టికల్చర్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు పర్యటించారు. ముంపునకు గురైన, దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతు బొల్లా సతీష్ రెడ్డికి చెందిన పసుపు పొలాలను సందర్శించారు. నేటి వరకు పంట వయస్సు, సాగుకు అయిన ఖర్చు తెలుసుకున్నారు. రెండు నెలల పంటగా తాను సాగు కోసం ?1,10,000 ఖర్చు చేశానని రైతు బదులిచ్చారు. నాలుగు రోజులుగా పంట పూర్తిగా నీటితో మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మరికొందరి రైతుల పంటలను పరిశీలించారు. చివరగా నూతక్కి సచివాలయం వద్ద రైతులతో మాట్లాడారు. రేపల్లె కెనాల్‌పై నాన్ రిటర్న్ వాల్ ఏర్పాటుకు సంబంధించి రైతులు అర్జి ఇచ్చారు. భారీ వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతు పొలాన్ని ఎన్యూమరేషన్‌లో నమోదు చేయాలని అధికారులను సూచించారు. నూతక్కి గ్రామంలో 200 హెక్టార్లలో అరటి, 140 హెక్టార్లలో పసుపు నీటమునిగగా, రామచంద్రపురం గ్రామంలో 28 హెక్టార్లలో అరటి, 28 హెక్టార్లలో పసుపు నీటమునిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీహెచ్ బి.రవీంద్రబాబు, డాక్టర్ సీవీ రామన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ వజ్రశ్రీ, తదితరులున్నారు.





# ఆడపిల్లల భద్రతకే తొలి ప్రాధాన్యం

◆ **ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు, మహానాడు:**

ఆంధ్రప్రదేశ్ లో ఆడపిల్లల భద్రతకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం స్టాల్ హై స్కూల్ బీసీ వసతి గృహాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పరిశీలించారు. నిన్న ఈ హాస్టల్‌లోని నలుగురు విద్యార్థులను వేధిస్తున్నారని నగరపాలెం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యిందని, క్షేత్ర స్థాయిలో తాను పరిశీలించటానికి వచ్చానని మీడియాకు తెలిపారు. విద్యార్థినులతో మాట్లాడి ఇక్కడ జరుగుతున్న తతంగాన్ని మొత్తం అడిగితెలుసుకున్నారు. రెండేళ్ళ నుంచి ఇలాగే జరుగుతోందని, గంజాయి బ్యాచ్ నేరుగా వసతి గృహంలోకి వచ్చి తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థినుల ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలు వస్తున్నాయని, ఆహారం కూడా సరిగ్గా ఉండటం లేదని, మరుగు దొడ్లకు సరయిన డోర్లు లేవని, వార్డెన్, నిర్వాహకుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులను కోరబోతున్నట్టు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 04, సెప్టెంబర్ 2024



వరద బాధితుల సహాయార్థం కృష్ణాజిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వెలగపూడి శంకరబాబు రూ.10 లక్షల విరాళం అందించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ సీఎం చంద్రబాబును కలిసి మంగళవారం రూ.10 లక్షలకు సంబంధించిన చెక్కును అందించారు. శంకరబాబును సీఎం చంద్రబాబు అభినందించారు.





## బిజెపి రాష్ట్ర కార్యాలయం కేంద్రంగా ఆహార పంపిణీ

విజయవాడ,మహానాడు:

బిజెపి రాష్ట్ర కార్యాలయం కేంద్రంగా విజయవాడ ముంపు ప్రాంతాలకు ఆహార పంపిణీ నిర్వహించారు.రాజరాజేశ్వరీ నగర్, వైఎస్ ఆర్ కాలనీ కి వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్ లు, ఆహారం ఈరోజు అందించారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురు పాటి కుమార స్వామి ఆహార పంపిణీ నిర్వహించారు, కలిదిండి మండలం కొండంగి గ్రామస్తులు ఆరువేల వాటర్ బాటిల్స్ బీజేపీ కార్యాలయానికి అందించారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురు పాటి కుమార స్వామి, షేక్ బాజీ లు మీడియా తో మాట్లాడుతూ మానవత్వం తో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కృష్ణలంక ప్రాంతంలో బిజెపి మీడియా ఇంఛార్జి పాతూరి నాగభూషణం ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ చేశారు.

## బాధితులకు భరోసానిస్తున్న బాబుకి
# జీవీఎల్ అభినందనలు

విజయవాడ,మహానాడు:

వరద ప్రభావిత ప్రాంతాల్లో అత్యంత దుర్భర పరిస్థితుల్లో బాధలు పడుతున్న విజయవాడ వాసుల పరిస్థితిని, వారికి అందుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు వాహనాలు కూడా చేరుకోలేని ప్రాంతాల్లో 22 కిలోమీటర్లకు పైగా జెసిబి పై పర్యటిస్తూ అక్కడ ప్రజలకు అందుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించడంతో పాటు భరోసానిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారిని బిజెపి జాతీయ నాయకులు జీవీఎల్ నరసింహారావు తన X (ట్విట్టర్) ద్వారా అభినందించారు.



ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో మాట్లాడి సమన్వయం చేసుకొని ముఖ్యమంత్రి చేపట్టిన ఈ సహాయక చర్యల ద్వారా విజయవాడ వాసులు తమకు ఎదురైన ఈ విపత్తు నుండి త్వరగా కోలుకుంటారని జీవీఎల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆంధ్రప్రదేశ్‌లో వరద పరిస్థితిపై
# ఆరా తీసిన నడ్డా

- సహాయక చర్యలులో బిజెపి శ్రేణులు
- బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి

విజయవాడ,మహానాడు:


వరదలు కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారుం. ప్రస్తుత పరిస్థితులను బిజెపి జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా స్వయంగా నాతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులను ఆరా తీసారని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు



దగ్గుబాటి పురంధేశ్వరి వెల్లడించారు. సహాయక చర్యలు లో పాల్గొనాలని నడ్డాజీ సూచించారు అన్నారు. బిజెపి శ్రేణులు సేవా కార్యక్రమాలు ఉధృతం చేసి,వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని రక్షిత ప్రదేశాలకు తరలించేందుకు బిజెపి శ్రేణులు సహకారం అందించాలని రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి విజ్ఞప్తి చేశారు.

## కేన్స్ గుజరాత్‌కు తరలిపోతున్నమాట నిజమేనా?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, మహానాడు:

కేన్స్ సంస్థ తెలంగాణలో పెడతామన్న తన యూనిట్‌ను గుజరాత్‌కు తరలి చేందుకు సిద్ధమైందని వార్తలు వస్తున్నాయి. అది వింటుంటే చాలా బాధని పిస్తోంది. ఈ సంస్థను కర్ణాటక నుంచి తెలంగాణకు రప్పించేందుకు ఎంతో కష్టపడ్డాం. హైదరాబాద్‌లో తమ యూనిట్ పెట్టాలంటే కొంగర కలాన్ లోని ఫాక్స్ కాన్ ప్లాంట్ పక్కన భూమి కేటాయించాలని వారు కోరారు. పది రోజుల్లోనే వారికి భూమి కేటాయించి తెలంగాణలో యూనిట్ పెట్టేందుకు ఒప్పించాం. దీంతో వాళ్లు గతేడాది అక్టోబర్‌లో తమ యూనిట్‌ను మన రాష్ట్రంలో పెడతామని ప్రకటించారు.

కానీ ఇప్పుడు ఆ సంస్థ గుజరాత్ కు తమ యూనిట్ ను తరలిస్తుందన్న వార్తలు చూస్తుంటే చాలా బాధనిపిస్తోంది. ఎంతో కష్టపడి కేన్స్ సంస్థ మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఒప్పిస్తే ఇప్పుడు ఆ సంస్థను తరలిపోకుండా కాపాడలేకపోతున్నారు. సెమీ కండక్టర్ ఇండస్ట్రీలో దాదాపు రూ. 3500 కోట్ల తో కేన్స్ మన వద్ద పెట్టుబడులు పెడతామని చెప్పింది. ఆ యూనిట్ ప్రారంభమై ఉంటే మన యువతకు ఉపాధితో పాటు రాష్ట్రానికి ఆదాయం పెరిగేది. ఇది తెలంగాణకు చాలా నష్టం.

## ఎంపీ వద్దిరాజు మాజీ మంత్రి పువ్వాడతో
# కలిసి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు

ఖమ్మం,మహానాడు:

బీఆర్ఎస్ ప్రముఖులపై దాడికి పాల్పడిన అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవలసిందిగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోతు మదన్ లాల్, మాజీ జేడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్ తదితరులు ఖమ్మం నగర పోలీస్ కమిషనర్ సునీల్ దత్ కు ఫిర్యాదు



చేశారు. మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, గుంటకండ్ల జగదీష్ రెడ్డి,సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావులు మున్నేరు ముంపు బాధితులను పరామర్శిస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు రాళ్లతో దాడికి దిగడంతో సంతోష్ రెడ్డి అనే బీఆర్ఎస్ నాయకుడు తీవ్రంగా గాయపడడాన్ని సీపీ సునీల్ దత్ కు పువ్వాడ అజయ్ కుమార్ వివరించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ బీఆర్ఎస్ ప్రముఖులు సీపీకి వినతిపత్రం సమర్పించారు.

## ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం

హైదరాబాద్,మహానాడు: ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామాలను సమీప మున్సి పాలిటీల్లో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాలు విలీన జాబితాలో ఉన్నాయి.

పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో.. బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్ తారామతిపేట పంచాయతీలు విలీనం


శంషాబాద్ మున్సిపాలిటీలో.. బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్ గూడ, ఘంసీమిగూడ విలీనం

నార్సింగి మున్సిపాలిటీలో.. మీర్జాగూడ గ్రామపంచాయతీ

తుక్కుగూడ మున్సిపాలిటీలో.. హర్షగూడ గ్రామపంచాయతీ

మేడ్చల్ మున్సిపాలిటీలో.. పూడూరు, రాయిలాపూర్ గ్రామపంచాయతీలు

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో.. కీసర, యాద్గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లి



నాగారం మున్సిపాలిటీలో బోగారం, గోదాముకుంట, కరీంగూడ, రాంపల్లి దాయార గ్రామాలు

పోచారం మున్సిపాలిటీలో.. వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరిగూడ విలీనం

ఘట్‌కేసర్ మున్సిపాల్టీలో.. అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడ విలీనం

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో.. మునీరాబాద్, గౌడవెల్లి పంచాయతీలు

తూంకుంట మున్సిపాలిటీలో.. బొంరాసిపేట, శామీర్ పేట, బాబాగూడ పంచాయతీలు విలీనం

## రైతులెవ్వరూ ఆందోళన చెందొద్దు

- కొల్లాపూర్ నియోజకవర్గంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి
- బైక్‌పై వెళ్లి నీటమునిగిన పంటలు, గండిపడిన కాల్వలు, కొట్టుకుపోయిన రోడ్ల పరిశీలన
- రైతులను పరామర్శించిన మంత్రి జూపల్లి



పాన్‌గల్,మహానాడు:

భారీ వర్షాల కారణంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో నీట మునిగిన పంట పొలాలను, గండిపడిన కాల్వలు, కొట్టుకుపోయిన రోడ్లను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

పాన్ గల్ మండలం దావాజీ పల్లి, అన్నారం, కొత్తపేట, రాయినిపల్లి, బండపల్లిలో మంత్రి పర్యటించారు. రాయినిపల్లి నుంచి బండపల్లి వరకు బైక్ పై వెళ్లి గండిపడిన కాలువ, దెబ్బతిన్న రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

రైతులతో మాట్లాడి నష్టపోయిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నష్టపోయిన ప్రతి ఎకరాకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. నీట మునిగి నష్టపోయిన పంట పొలాల వివరాలు అధికారుల ద్వారా సేకరించి..ఎకరానికి రూ. 10 వేల పంట నష్ట పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా అందజేస్తామని హామీ ఇచ్చారు.

వ్యవసాయ శాఖ అధికారులు పంటపొలాలను సందర్శించి నష్టపరిహారాన్ని అంచనా వేయాలని ఆదేశించారు. యుద్ధ ప్రతిపాదిక రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని, గండి పడిన కాల్వలను వెంటనే పూడ్చాలని సంబంధిత అధికారు లను మంత్రి ఆదేశించారు.

## నీట మునిగిన పాలమూరు - రంగారెడ్డి
# ఎత్తిపోతల వట్టెం పంప్ హౌస్

- పరిశీలించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి

కుమ్మెర,మహానాడు:

ఒక్క రోజు కురిసిన కుంభ వృష్టి వర్షంతో పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల వట్టెం పంప్ హౌస్ నీట మునిగిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి మంగళవారం పరిశీలించారు. నాగర్ కర్నూలు జిల్లా కేంద్రం కుమ్మెర గ్రామ శివారులో ఉన్న వట్టెం పంప్ హౌస్ ప్రాంతాన్ని చిన్నారెడ్డి పరిశీలించి ఇంజనీర్లకు దిశా నిర్దేశం చేశారు.

మూడు రోజుల క్రితం ఒక్క రోజులో 14 సెంటి మీటర్ల వర్షం కురవడంతో వట్టెం పంప్ హౌస్‌లో నీరు చేరి 5 పంప్ లు నీట మునిగిపోయాయి.నాగర్



కర్నూలు శివారులోని నాగనోల్ చెరువులోకి దాదాపు 50 చెరువుల నీళ్ళు అలుగు పారడంతో ఆ నీరు అంతా వట్టెం పంప్ హౌస్ లోకి చేరి భారీ పంప్ లను ముంచెత్తాయి.

ఈ విషయం తెలుసుకున్న చిన్నారెడ్డి హుటాహుటిన వట్టెం పంప్ హౌస్ ప్రాంతానికి చేరుకుని ఇంజనీర్లు ఎస్. ఈ. సత్యనారాయణ రెడ్డి, ఈ ఈ పార్థ సారథి, డీ ఈ లు సత్యనారాయణ గౌడ్, బాగయ్య లతో సమావేశమై పరిస్థితిని సమీక్షించిన అనంతరం సంఘటన స్థలాన్ని చిన్నారెడ్డి సందర్శించారు.

ఈ ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మాణ సంస్థ ఇంకా ప్రభుత్వానికి అప్పగించనందున పంప్ హౌస్ లోని నీటిని ఎత్తి పోసి పంప్ లను పూర్వ స్థితికి తీసుకొచ్చే బాధ్యత నిర్మాణ సంస్థదే అని, ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం పడదని చిన్నారెడ్డి తెలిపారు. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో జాగ్రత్తలు తీసుకోవాలని చిన్నారెడ్డి ఇంజనీర్లకు సూచించారు. వట్టెం పంప్ హౌస్ వద్ద ఉన్న ఒక్కో పంప్ 2,400 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసే సామర్థ్యం ఉన్న 10 పంప్ లు ఈ ప్రాంతంలో బిగిస్తున్నారు. వట్టెం రిజర్వాయర్ 16 టీ ఎం సీ కెపాసిటీ సామర్థ్యంతో ఉంది.



విజయవాడ వరద బాధితులకు ఎన్నారై తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఫుడ్ పాకెట్లు వాటర్ బాటిల్స్ బిస్కెట్లు మందులు పంపిణీ

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 04, సెప్టెంబర్ 2024

# రాష్ట్రవ్యాప్తంగా చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తాం

(మొదటిపేజీ తరువాయి..)

కానీ ఎక్కడికక్కడ కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువుల్లో ఆక్రమణ తొలగింపును ప్రాధాన్యంగా పెట్టుకున్నామని, చెరువులు, నాలాల ఆక్రమణలో ఎంతటి వారున్నా తొలగింపునకు వెనుకాడబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ముందుగా చెరువులు, నాలాల ఆక్రమణపై నివేదిక రూపొందించుకోవాలని, ఏవైనా కోర్టు కేసులు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ లో కేవలం ఒక నాలాపై ఆక్రమణలు తొలగిస్తేనే రాం నగర్‌లో ముంపు బారి నుంచి బయటపడిన విషయాన్ని ముఖ్యమంత్రి ఉదాహరించారు.

ఖమ్మంలో మంత్రి పొంగులేటి నివాసంలో మంగళవారం



విలేకరులతో ఇష్టాగోష్టిలో, మహబూబాబాద్ జిల్లా సమీక్షలో ఈ విషయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆకేరు వాగు పొంగడంతో కారు కొట్టుకుపోయి యువ శాస్త్రవేత్త నూనావత్ అశ్వినీ, ఆమె తండ్రి మోతీలాల్ మృతిచెందిన విషయం విదితమే. మంగళవారం ఉదయం ఖమ్మం నుంచి నేరుగా సింగరేణి మండలం గంగారాం తండాలోని అశ్వినీ ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేరుకున్నారు.

అశ్వినీ, మోతీలాల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అశ్వినీ తల్లి నేజీ, ఆమె కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించి ఓదార్చారు. అశ్వినీ అన్న అశోక్‌కు ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆ కుటుంబానికి ఇల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

### ఆకేరు ప్రవాహం శాస్త్రీయ సర్వే చేపడతాం

ఆకేరు వాగు ప్రవాహంపై శాస్త్రీయ సర్వే చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆకేరు వాగు పొంగడంతో ప్రతి సారి తాము ముంపు బారిన పడుతున్నామని సీతారాం తండా వాసులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. గంగారాం తండాలో అశ్వినీ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబాబాద్ జిల్లాలో ఆకేరు వాగు పొంగి కల్వర్టు, రహదారి తెగిపోయిన ప్రాంతానికి చేరుకొని దానిని పరిశీలించారు.

అక్కడే అశ్వినీ, ఆమె తండ్రి మోతీలాల్ పయనిస్తున్న కారు ఆకేరు వాగు ప్రవాహానికి కొట్టుకుపోయి వారు ప్రాణాలు కోల్పోయారు. ఆ ప్రాంతాన్ని, ఆకేరు వాగును, కల్వర్టు కొట్టుకుపోయిన తీరును ముఖ్యమంత్రి పరిశీలించారు. వాగు ప్రవాహ ఉద్ధృతి ఎలా ఉంటుంది.. గతంలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకున్నాయా అని ముఖ్యమంత్రి స్థానికులను ప్రశ్నించారు.

ప్రతిసారి వాగు పొంగడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, రహదారి గతంలోనూ తెగిందని స్థానికుడు జర్పుల లక్ష్మణ్ ముఖ్యమంత్రికి తెలిపారు. అక్కడి నుంచి ఆకేరు పొంగి ముంపు బారిన పడిన సీతారాం తండాకు ముఖ్యమంత్రి చేరకున్నారు. తండాలో ఇళ్లు మునిగిన వారిని ఓదార్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాము తీవ్రంగా నష్టపోయామని, ఆకేరు వాగు పొంగిన ప్రతిసారి తమ తండాతో సమీపంలోని మరో రెండు తండాలకు నిద్ర ఉండడం లేదని, తమను రక్షించాలని ముఖ్యమంత్రిని తండా వాసులు కోరారు.

తండా వాసులను ఓదార్చిన అనంతరం ముఖ్యమంత్రి వారిని ఉద్దేశించి మాట్లాడారు. మూడు తండాలను కలిపి ఒకే చోట మోడల్ కాలనీ ఏర్పాటు చేస్తామని.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆకేరు వాగు పొంగి ఇళ్ల లోని పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు, సర్టిఫికెట్స్ తడిచిపోయినందున ఒకే FIR దాఖలు చేసి అందరికీ నూతన కార్డులు, సర్టిఫికెట్స్, పాసు పుస్తకాలు మంజూరయ్యేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఆకేరు ప్రవాహంపై శాస్త్రీయంగా అంచనా వేసి నూతన వంతెన నిర్మిస్తామని, నీటిని సమీపంలోని చెరువులు, కుంటలకు మళ్లించే ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆకేరు వాగు వరదతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

### అప్రమత్తతతో ముప్పు తగ్గించగలిగాం

గతంలో ఎన్నడూ లేనంతగా మహబూబాబాద్ జిల్లాలో వర్షపాతం నమోదైనా ముందస్తు జాగ్రత్తలు చేపట్టడంతో ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గించగలిగామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో చోటు చేసుకున్న పంట, ఆస్తి నష్టాలపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి తిలకించారు. అనంతరం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. తాము ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఊహించని వర్షాలు, వరదలతో మహబూబాబాద్ జిల్లాలో నలుగురు ప్రాణాలు కోల్పోయారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

వారిలో ఖమ్మం జిల్లాకు చెందిన వారు ఇద్దరు,



మహబూబాబాద్ జిల్లాకు చెందిన వారు ఇద్దరని ముఖ్యమంత్రి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని.... ఎకరాకు రూ.పది వేల చొప్పున పంట నష్ట పరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. జిల్లాలో ముంపు బారిన పడిన 680 మందిని సహాయక శిబిరాలకు తరలించామని సీఎం చెప్పారు. సీతారాం తండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలిచిన ఎస్సై నగేష్ కి అభినందనలు తెలిపారు.

జిల్లాలో విపత్తు సమయంలో సత్వరం స్పందించిన పోలీసు, రెవెన్యూ సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. జిల్లాల్లో విపత్తుల సమయంలో ఏం జరిగింది.. ఆ సమస్యను ఎలా అధిగమించారు... ఎలా సహాయక చర్యలు తీసుకున్నారనే దానిపై బ్లూబుక్ రూపొందించుకోవాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి సూచించారు. ఆ బ్లూ బుక్ భవిష్యత్‌లో వచ్చే అధికారులకు విపత్తుల సమయంలో కరదీపికగా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు.

### పువ్వాడ అజయ్ ఆక్రమణల తొలగింపునకు హరీష్ సహకరిస్తారా?

ఖమ్మం ముంపు బారిన పడడానికి మాజీ మంత్రి పువ్వాడ ఆక్రమణలే కారణమని తనకు ఫిర్యాదులు అందాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి ఇష్టారీతిగా కాలువలు ఆక్రమించారని, దాంతో ఖమ్మం ముంపు బారిన పడిందని తాను పరామర్శిస్తున్నప్పుడు స్థానికులు చెప్పారన్నారు. పదేళ్ల కాలం నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీష్ రావు ఈ ఆక్రమణలపై ఏమంటారని, వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్లు హరీష్ రావు ఇప్పుడు బాధితుల పరామర్శకు బయలుదేరారని ముఖ్యమంత్రి మండిపడ్డారు.

ఖమ్మంలో మాజీ మంత్రి పువ్వాడ ఆక్రమణల తొలగింపునకు హరీష్ రావు చిత్తశుద్ధితో సహకరిస్తారా..? దగ్గర ఉండి ఆక్రమణలు తొలగింపజేస్తారా అని ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. ఖమ్మంలో పువ్వాడ ఆక్రమణలకు సంబంధించి వాస్తవాలు వెలికితీయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

తాము అధికారంలోకి వచ్చాక తొలిసారిగా వేసిన టెండర్



ఖమ్మం మున్నేరు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపుకేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం అంతకు మించిన ఎత్తులో నీరు వచ్చినందున.. ఆ ఎత్తు పెంపు సమీక్షిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

### రెండింటిని పోల్చి చూసుకోండి

తెలంగాణలోని ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలు కవల పిల్లల వంటివని, కృష్ణాతో పోల్చితే ఖమ్మంలోనే ఎక్కువ నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి తెలిపారు. జిల్లాకు చెందిన



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో మరింత నష్టం వాటిల్లకుండా చూసుకోగలిగామని ముఖ్యమంత్రి తెలిపారు.

తాను కంటిపై కునుకు లేకుండా పర్యవేక్షణ చేశానని సీఎం చెప్పారు. ప్రకృతి విపత్తుల సమయంలో త్వరగా చేరుకోవడానికి వీలుగా హెలీకాప్టర్లను పంపుతారని, ఖమ్మానికి విజయవాడ దగ్గర ఉన్నందునే అక్కడకు హెలీకాప్టర్లు చేరుకున్నాయని.. ఈ సమయంలో ప్రాంతం, రాజధాని వంటివి చూసుకోకూడదని ముఖ్యమంత్రి అన్నారు. భారీగా నష్టం వాటిల్లినందునే కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ప్రధానమంత్రి నరేంద్రమోదీని రాష్ట్రంలో పర్యటించాలని కోరామని ముఖ్యమంత్రి తెలిపారు.

### ఏనాడైనా బాధితులను పరామర్శించారా?

పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఏనాడైనా వరద, ప్రమాద బాధితులను పరామర్శించారా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. వరద బాధితుల వద్దకు ఏనాడూ కేసీఆర్ వెళ్లలేదని, సొంత నియోజకవర్గం మాసాయిపేటలో రైలు ప్రమాదంతో చిన్నారులు చనిపోయినా, హైదరాబాద్ ఓఆర్ఆర్ లో పశు వైద్యురాలు అత్యాచారానికి, హత్యకు గురైతే కనీసం వాళ్ల కుటుంబ సభ్యులను కేసీఆర్ పరామర్శించలేదని ముఖ్యమంత్రి మండిపడ్డారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష నేతలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని కేసీఆర్ ఏం చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అమెరికాలో ఎంజాయ్ చేస్తున్న



కేటీఆర్ క్షేత్రంలో ఉండి సహాయక చర్యలు చేపడుతున్న మంత్రులపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో దోచుకున్న రూ.లక్ష కోట్ల నిధుల్లో రూ.వెయ్యి కోట్లో... రూ. రెండు వేల కోట్లో సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇవ్వాలని కేసీఆర్ కుటుంబానికి ముఖ్యమంత్రి సూచించారు.

### సీఎంఆర్ఎఫ్ కు విరాళాలు

వరద సహాయక చర్యలు చేపట్టేందుకు గానూ ముఖ్యమంత్రి ఉపశమన నిధి (సీఎంఆర్ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ ఒక రోజు మూల వేతనం రూ.135 కోట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెక్ రూపంలో అందజేశారు. వారికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

మహబూబాబాద్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయి సింధు రాష్ట్రంలో వరద సహాయక చర్యలకు తాను దాచుకున్న రూ.3 వేలను ముఖ్యమంత్రికి అందజేశారు. విద్యార్థినిని ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్రంలోని స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు.

మహబూబాబాద్ జిల్లా సమీక్షలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మురళీ నాయక్, రామచంద్ర నాయక్, యశస్వినీ రెడ్డి, గండ్ర సత్యానారాయణరావు, నాగరాజు, కోరం కనకయ్య, అధికారులు పాల్గొన్నారు.

---

# కేసీఆర్.. ఎక్కడ?

- వరదసాయంలో కనిపించని వైనం
- తెలంగాణలో ఫాంహౌస్‌కే కేసీఆర్ పరిమితం
- హైదరాబాద్, ఖమ్మంలో మినహా కనిపించని గులాబీదళం
- అమెరికా నుంచి సర్కారు సాయంపై కేటీఆర్ విమర్శల ట్వీట్లు
- హాస్టళ్లలో హరీష్‌రావు పర్యటనలు
- వానలోనూ బాబు-రేవంత్ పర్యటనలు, పరామర్శలూ
- విపత్తులోనూ బయటకు రాని కేసీఆర్‌పై విమర్శలు
- ఆపన్నులకు సాయం బీఆర్ఎస్ సాయం చేయదా?
- సోషల్‌మీడియాలో తడిసిముద్దవుతున్న కేసీఆర్

(మార్తి సుబ్రహ్మణ్యం)

భారీ వర్షాలకు తెలుగు రాష్ట్రాలు తడిసిముద్దవుతున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మూడురోజుల నుంచి నిర్విరామంగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల్లో జనజీవనం స్తంభించిపోయింది. రెండు రాష్ట్రాల్లో దాదాపు 30 మంది మృతి చెందగా, గేదెలు, ఆవులు, కోళ్లు నేలరాలాయి. పశుసంపద దాదాపు నీటిపాలయింది. చెట్టు కూలి రోడ్లపై పడిపోయాయి. ఫలితంగా సామాన్య జనం రోడ్డునపడిన నేపథ్యంలో.. వారికి భరోసా ఇచ్చి సాయం చేసేందుకు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు.

ఏపీ సీఎం చంద్రబాబునాయుడయితే మూడురోజుల నుంచి కృష్ణాజిల్లా కలెక్టర్ క్యాంపు ఆఫీసునే సెక్రటేరియేట్‌గా మార్చేసి, అక్కడి నుంచి సమీక్షలు నిర్వహిస్తున్నారు. పడవల్లో బెజవాడ మొత్తం కలియతిరుగుతూ, మోకాలు లోతు నీటిలో పర్యటిస్తున్నారు. ఇక బాగా నష్టపోయిన ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సైతం క్షేత్రస్థాయి పర్యటనలు చే సి, బాధితులకు మేమున్నామని భరోసా ఇస్తున్నారు. ఇళ్లలోకి వెళ్లి బాధితుల బాధలు విన్నారు. ఆ విధంగా ఏపీ-తెలంగాణ సీఎంలు.. జలంలో చిక్కుకున్న జనాల మధ్యనే ఉంటూ వారిలో ధైర్యం నూరిపోస్తున్నారు.

ఈ నేపథ్యంలో పదేళ్లు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. ఎక్కడా కనిపించకపోవడంపై అటు రాజకీయ వర్గాలు, ఇటు సోషల్‌మీడియాలో విమర్శల వర్షం కురుస్తోంది. తెలంగాణను పదేళ్లు కంటితో శాసించిన మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ క్లిష్ట సమయంలో జనంలోకి రాకపోవడంపై అటు సొంత పార్టీ నేతల్లోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. వర్ష ప్రభావం ఉన్న జిల్లాల్లో సీఎం రేవంత్‌రెడ్డి సహా, మంత్రులంతా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా సహాయ కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. అయితే హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా వర్షాల్లో రోడ్లపై తిరుగుతూ, చురుకుగా వ్యవహరిస్తుండగా, ఖమ్మంలో ఎంపి వద్దిరాజు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇక మిగిలిన వారంతా రోజూ పత్రికా ప్రకటనలు, ప్రెస్‌మీట్లు పెట్టి సర్కారు వైఫల్యాలను ఎండగట్టేందుకే పరిమితమవుతున్నారు. సీనియర్ నేత హరీష్‌రావు హాస్టళ్లను సందర్శిస్తుండగా, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికా పర్యటనలో బిజీగా ఉంటూ, రేవంత్ సర్కారు వైఫల్యాలపై ట్వీట్లకు పరిమితమవుతున్నారు.

ఏపీలో ప్రతిపక్షనేత జగన్ రెండురోజులు ఆలస్యమైనప్పటికీ, మూడవరోజున విజయవాడలో ముంపు ప్రాంతాల్లో దిగి బాధితులను పరామర్శించారు. వామపక్షనేతలు సైతం వాననీటిలో దిగి బాధితులను పరామర్శిస్తున్నారు. కానీ



తెలంగాణలో పదేళ్లు సీఎంగా చేసి, విపక్షనేతగా ఉన్న కేసీఆర్ మాత్రం, ఫాంహౌస్ నుంచి కాలుబయటపెట్టకపోవడం విమర్శలను దారితీసింది. ఇలాంటి క్లిష్ట సమయంలో కేసీఆర్ జనంలోకి వస్తే, అటు పార్టీకి సైతం మంచిపేరు వస్తుందని పార్టీ నేతలే చెబుతున్నారు.

పోనీ పార్టీపరంగా కూడా.. బాధితులకు ఇప్పటిదాకా సాయం చేయకపోవడంపైనా, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సహజంగా ఇలాంటి విపత్తులో ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు, తమ నిధుల నుంచి బియ్యం, ఉప్పు, పప్పు, నూనె, మంచినీళ్ల బాటిళ్లు, పాలు, అగ్గిపెట్టెల వంటి నిత్యావసర వస్తువులు బాధితులకు స్వయంగా అందిస్తుంటాయి. అధికారికంగా వందల కోట్ల బ్యాంకు బ్యాలెన్సు ఉన్న బీఆర్ఎస్, ఇప్పటిదాకా అలాంటి సహాయ చర్యలు చేపట్టకపోవడంపై, సొంత పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. నిజానికి నిధులకు కొరత లేని బీఆర్ఎస్ తలచుకుంటే ఒక జిల్లాలో ప్రజలందరికీ ఒకరోజు నిత్యావసర వస్తువులందించే సత్తా ఉందని గుర్తు చేస్తున్నారు. ఇటీవలి ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా దేశంలోనే అత్యధిక నిధులున్న పార్టీగా బీఆర్ ఎస్ రికార్డు సృష్టించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు.

చివరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, బాధితులకు బాసటగా తమ నెల జీతం కూడా ప్రకటించకపోవడమే ఆశ్చర్యం. అటు సీఎం రేవంత్‌రెడ్డి సైతం 'లక్ష కోట్ల ఆస్తులున్న కేసీఆర్ కుటుంబం, బాధితుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు వెయ్యి కోట్లు ఎందుకివ్వదు' అని ప్రశ్నించడం ప్రస్తావనార్హం.

కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు రాకుండా.. తన పార్టీ నేతలతో ప్రభుత్వ సాయంపై విమర్శలు చేయించడాన్ని తటస్తులు, మేధావులు కూడా స్వాగతించలేకపోతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ఏ ప్రభుత్వం ఉన్నా.. తన పరిమితుల మేరకే సాయం చే స్తుందని, రాజకీయ పార్టీలు- స్వచ్ఛంద సంస్థలు- పారిశ్రామికవేత్తల సహాయ సహకారాలతోనే ఏ ప్రభుత్వమైనా, ఇలాంటి విపత్తు సమయంలో ముందడుగు వేస్తుంటుందని గుర్తు చేస్తున్నారు.

ఇలాంటి సమయంలో ప్రభుత్వానికి సాయం చేసేబదులు.. హైదరాబాద్, అమెరికాలో కూర్చుని విమర్శలు చేయటం వల్ల అధికారులతోపాటు, బాధితుల ఆత్మస్థైర్యం కూడా దెబ్బతింటుందని విశ్లేషిస్తున్నారు. ఎక్కడో అమెరికాలో ఉన్న కేటీఆర్ కూడా టీట్లతో ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని, మంత్రి సీతక్క ధ్వజమెత్తిన విషయం తెలిసిందే.

' లక్షకోట్లు సంపాదించిన మీ కుటుంబం ఎప్పుడైనా నీళ్లలో దిగి, బాధితులను ఆదుకుందా? మేం ఇక్కడ ప్రజాక్షేత్రలో పనిచేసి బాధితులకు భరోసా కల్పిస్తుంటే అభినందించాల్సిన మీరు, అమెరికాలో ఉండి ట్వీట్లలో విమర్శిస్తున్నారు. మీకేమైనా సిగ్గుందా' అంటూ సీతక్క విరుచుకుపడ్డ వైనం చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి క్లిష్ట సమయంలో అభినందించి, సాయం చేయకపోయినా, పనికట్టుకుని చేసే విమర్శలను ఎవరూ స్వాగతించరన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 'సహాయ చర్యలో అధికారుల అవినీతిని విమర్శిస్తే తప్పు లేదు. కానీ అసలు సహాయ చర్యలే జరగడం లేదని విమర్శిస్తే ఎవరూ హర్షించరు. అది బురదరాజకీయమవుతుంద'న్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 04, సెప్టెంబర్ 2024



## ‘జనక అయితే గనక’ ఆద్యంతం నవ్వించేలా ...
### - నిర్మాత దిల్ రాజు

వెర్సటైల్ యాక్టర్ సుహాస్, సంగీర్తన హీరో హీరోయిన్లుగా దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందిన తాజా చిత్రం ‘జనక అయితే గనక’. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రాన్ని సందీర్ రెడ్డి బండ్ల డైరెక్ట్ చేశారు. సెప్టెంబర్ 7న ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ మీడియా ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో దిల్ రాజు మాట్లాడుతూ.. “జనక అయితే గనక’ సెన్సార్ అయింది.యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చారు. ఆల్రెడీ టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. సుహాస్ తన ప్రతీ సినిమాతో ఒక్కో మెట్టు ఎక్కుతూనే ఉన్నాడు. కొత్త కథలను చెప్పేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఓ మామూలు స్థాయి నుంచి వచ్చి ఇప్పుడు ఆయన ఎంచుకుంటున్న కథలు, స్క్రిప్టులు చాలా గొప్పగా ఉన్నాయి. సుహాస్ అంటే మినిమం గ్యారెంటీ అని యూఎస్ డిస్ట్రిబ్యూటర్లు కూడా చెబుతున్నారు. దిల్ రాజు ప్రొడక్షన్ అంటే ఫ్యామిలీతో చూడదగ్గ సినిమానే ఉంటుంది. కాకపోతే ఈ సినిమా కథ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. కాస్త పక్కకు జరిగి ఈ కథను చేసినా ఆ లైన్ దాటకుండా తీశాం.

ఆడియెన్స్‌ను ఎడ్యుకేట్ చేసేలా ఉంటుంది. సినిమా గురించి నేను తక్కువ మాట్లాడతాను. సినిమానే ఎక్కువ మాట్లాడాలని కోరుకుంటున్నాను. విజయ్ బుల్గానిన్ మంచి పాటలు ఇచ్చారు. ఈ సినిమా మాత్రం ఆద్యంతం నవ్వించేలా ఉంటుంది. ఓ మంచి సందేశాన్ని ఇచ్చారు అనే ఆలోచనతో థియేటర్ నుంచి బయటకు వస్తారు’ అని అన్నారు.

## ‘విశ్వం’ హైలీ ఎంటర్‌టైనింగ్ టీజర్



డైరెక్టర్ శ్రీను వైట్ల కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లను డీల్ చేయడంలో ఎక్స్ పర్ట్. ముఖ్యంగా కామెడీని హ్యాండిల్ చేయడంలో దిట్ట. మాచో హీరో గోపీచంద్ తో శ్రీను వైట్ల రూపొందిస్తున్న స్టైలిష్ యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘విశ్వం’. ప్రమోషన్స్‌ను కిక్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. టీజర్ నరేష్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైయింది. గోపీచంద్, కావ్యా థాపర్ పాత్రల పరిచయం, వారి క్యారెక్టర్స్ లో కామెడీ స్పార్క్ ఆకట్టుకున్నాయి. టీజర్ లో ప్రముఖ నటీనటులతో కామెడిక్ సీన్స్ హిలేరియస్ గా వున్నాయి, టీజర్ చివరి భాగంలో యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ అదిరిపోయాయి. ఎంటర్‌టైన్‌మెంట్,యాక్షన్‌ని ఎఫెక్టివ్‌గా బ్యాలెన్స్ చేస్తూ హైలీ ఎంటర్‌టైనింగ్ టీజర్ ని ప్రజెంట్ చేశారు శ్రీను వైట్ల. డైలాగ్‌లు, కామెడీ, యాక్షన్ బ్లెండ్ మంచి కమర్షియల్ ఔటింగ్ ని ప్రామిస్ చేస్తున్నాయి. గోపీచంద్ అల్ట్రా-స్టైలిష్‌గా కనిపించారు. తన ఇంటెన్సిటీతో కామెడీని బ్లెండ్ చేసే పాత్రలో మెరిశారు. కావ్య థాపర్ తన గ్లామర్‌తో ఆకట్టుకోగా, నరేష్, వెన్నెల కిషోర్, మిగతా నటులు వినోదాన్ని అందించారు.

## “పోలీస్ వారి హెచ్చరిక” ఫస్ట్ లుక్

అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో తూలిక తనిష్క్ క్రియేషన్స్ పతాకంపై బెల్లి జనార్ధన్ నిర్మిస్తున్న “పోలీస్ వారి హెచ్చరిక” చిత్రం ఫస్ట్ లుక్ ను హీరో శ్రీకాంత్ తన నివాసం లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ “టైటిల్ ఎంత ఆకర్షణీయం గా ఉందో ఫస్ట్ లుక్ కూడా అంతే ఆకర్షణీయంగా ఉందని, ఎవరినైనా తాళ్ళతోనో , సంకెళ్ళతోనో కట్టి బంధిస్తారని, కానీ ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ లో ఒక పోలీస్ ను తుపాకులతో కట్టి బంధించడం నిజంగా కొత్తగా ఉందని , ఎప్పుడూ కొత్త కథల తో , కొత్త ఆలోచనలతో అడుగులేసే దర్శకుడు బాబ్జీ ఈ సినిమాతో మంచి సక్సెస్ సాధిస్తాడని నాకు గట్టి నమ్మకం ఉందని” ఉద్ఘాటించారు. “సినీ పరిశ్రమలో నేను అన్నయ్య అని పిలిచేది హీరో శ్రీకాంత్ గారిని మాత్రమేనని, మంచి మనసున్న శ్రీకాంత్ గారి చేతులమీదుగా ఫస్ట్ లుక్ ను విడుదల గావించుకున్న మా “పోలీస్ వారి హెచ్చరిక” చిత్రాన్ని మంచి మనసున్న ప్రేక్షక మహాశయులు గొప్పగా ఆదరిస్తారనే నమ్మకం మాకుందని” దర్శకుడు బాబ్జీ అన్నారు. నిర్మాత బెల్లి జనార్ధన్ మాట్లాడుతూ “ఎప్పటికైనా హీరో శ్రీకాంత్ గారితో ఒక ఫోటో దిగాలనుకున్నాను , అటువంటిది యీ రోజు నా సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ నే ఆయన ఆవిష్కరించడం నేను చేసుకున్న అదృష్టం. గతంలో కూడా హీరో శ్రీకాంత్ గారు మా సినిమా నుండి క్యారెక్టర్లు చేస్తూ ఎంతగానో సహాయపడ్డారు” అన్నారు.





# వరద బాధితుల కోసం ఆ నలుగురు

50 ఏళ్ల నుంచి నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది- వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగుజాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది.. ఈ ఋణం తీరనిది. భారీ వర్షాలు తెలుగు రాష్ట్రాల్ని ముంచెత్తిన సంగతి తెలిసిందే. దీంతో సినీ పరిశ్రమ నుంచి పెద్ద ఎత్తున విరాళాలు అందుతున్నాయి. ఇప్పటికే పలువురు నటులు, నిర్మాతలు విరాళం అందించగా తాజాగా మరింత మంది ముందుకొచ్చారు. దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు ఎస్ . రాధాకృష్ణ, నాగవంశీ 50 లక్షలు విరాళం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ కి 25 లక్షలు, తెలంగాణకు 25 లక్షలు చొప్పున 50 లక్షలు ముఖ్యమంత్రుల సహాయ నిధికి అందజేస్తున్నట్లు



తెలిపారు. వరద బాధితులకు అండగా తనవంతు సాయాన్ని అందించటానికి ఆయన ముందుకు వచ్చారు.-భారీ వర్షాల వల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతోన్న ఆస్తి, ప్రాణ నష్టాలు మమ్మల్ని ఎంతగానో కలచి వేసాయి. ఆ విపత్తు నుంచి తెలుగు ప్రజలు త్వరగా కోలుకోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తూ మా వంతు సహాయం అందిస్తున్నాం- అన్నారు. అలాగే యువ నటుడు సిద్దు జొన్నలగడ్డ కూడా ఆపన్న హస్తం అందించారు. ఒక్కో రాష్ట్రానికి 15 లక్షలు చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలకు 30 లక్షలు విరాళం అందించారు.

రూ. 5 లక్షల చొప్పున రూ.10 లక్షల విరాళం ప్రకటించిన దర్శకుడు వెంకీ అట్లూరి. ఏపీకి రూ.25 లక్షలు విరాళం ప్రకటించిన అశ్వినీదత్.

- తెలుగు రాష్ట్రాలను వరదలు ముంచెత్తడం బాధాకరం. ప్రజలు పడుతోన్న ఇబ్బంది చూస్తుంటే ఎవరికీ ఇలాంటి పరిస్థితి రాకూడదనిపిస్తుంది. ఈ వరదలు చాలా కుటుంబాలను కష్టాల్లోకి నెట్టేసాయి. ఇలాంటి సమయంలో ఒకరికొకరు తోడుగా ఉండటం ఎంతైనా అవసరం. వరద బాధితులకు నా వంతుగా తెలుగు రాష్ట్రాలకు 30 లక్షలు అందిస్తున్నా. ఇది కొంత మందికి ఏదో రూపంలో ఉపయోగ పడుతుందని ఆశిస్తున్నాను- అని అన్నారు.

### ఎన్టీఆర్, విశ్వక్‌సేన్ భారీ విరాళం

హైదరాబాద్, మహానాడు:
తెలుగు రాష్ట్రాలకు యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారీ విరాళం ప్రకటించారు. తెలంగాణకు రూ.50 లక్షలు, ఏపీకి రూ.50 లక్షలను ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేస్తున్నట్టు మంగళవారం ట్విట్ చేశారు. ‘భారీ వర్షాల వల్ల తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న బీభత్సం నన్ను ఎంతగానో కలచివేసింది. ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు త్వరగా కోలుకోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను.’ అని ఎన్టీఆర్ తెలిపారు. మరోవైపు టాలీవుడ్ హీరో విశ్వక్ సేన్ కూడా ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5 లక్షలు విరాళం అందజేశారు.

### తెలుగు రాష్ట్రాలకు బాలకృష్ణ భారీ విరాళం

- ఏపీకి రూ. 50 లక్షలు, తెలంగాణకు రూ.50 లక్షలు

హైదరాబాద్, మహానాడు:
మా నాన్నగారు నా నుదుటిన 50 ఏళ్ళ క్రితం దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది.. 50 ఏళ్ల నుంచి నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది.. వెలుగుతూనే ఉంది.. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగుజాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది.. ఈ రుణం తీరనిది. ఈ జన్మ మీకోసం.. మీ ఆనందం కోసం. నా ఈ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ప్రస్తుతం తెలుగు నేలను వరద ముంచెత్తుతోంది. ఈ విపత్కర పరిస్థితులలో బాధాతప్త హృదయంతో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు., తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు నా బాధ్యతగా బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను. రెండు రాష్ట్రాలలో మళ్ళీ అతి త్వరలోనే సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను... అని ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు.

### అనన్య పాండే లైగర్ టైమ్

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్య పాండే ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూనే ఉంటోంది. బీ టౌన్ యాక్టర్ చుంకీ పాండే కుమార్తెగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు.. తక్కువ టైమ్ లోనే ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. జీరో సైజ్ బ్యూటీగా ఫేమ్ సంపాదించుకుంది. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2 మూవీతో ఒక్కసారి లైమ్ లైట్ లోకి వచ్చిన బ్యూటీ.. వరుస అవకాశాలు అందుకుని ఇప్పుడు దూసుకుపోతోంది. సూపర్ హిట్ చిత్రాల్లో నటిస్తోంది.

అయితే తెలుగులోకి లైగర్ మూవీతో అనన్య పాండే ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. స్టార్ హీరో విజయ్ దేవరకొండ లీడ్ రోల్ లో పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఆ సినిమా.. డిజాస్టర్ గా నిలిచింది. దీంతో విజయ్, పూరీ భారీగా విమర్శలు ఎదుర్కొన్నారు. లైగర్ తో టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ అవుదామనుకున్న అనన్యకు కూడా నిరాశే మిగిలింది. ఆ తర్వాత ఒక్క అవకాశాన్నీ అందుకోలేకపోయింది అమ్మడు. దీంతో బాలీవుడ్ లోనే మళ్లీ సెటిల్ అయిన అనన్య.. %ఝుశ్రీశ్రీ వీవ ద్ఘువ% షోలో చేసిన లేటెస్ట్ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తాను ఒక యంగ్ హీరోయిన్ గా .. ఇండస్ట్రీలో అవసరమైనప్పుడు కచ్చితంగా మాట్లాడుతానని తెలిపింది, ప్రస్తుత జనరేషన్ యువతీ యువకులు తమ అభిప్రాయాలను కచ్చితంగా షేర్ చేసుకోవాలని చెబుతోంది. అందుకు ఉదాహరణగా లైగర్ మూవీ టైమ్ లో



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144